Follow: @mahaadaily
01-12-2025
ANN తెలుగు
# మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ ...టి- 22 సంచిక- 342 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTER... L/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

టాప్ న్యూస్



## నేనూ ఐబొమ్మలో సిన్మాలు చూశా...

- రవి ఒక యోధుడు, ఎన్‌కౌంటర్ చేస్తే వంద మంది పుడతారు
- సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు
- సినిమా మాఫియాకు ఉరిశిక్ష వేయండి

02



## రాంచీలో కోహ్లీ విశ్వరూపం

- సచిన్ ఆల్‌టైమ్ రికార్డు బద్దలు

02



## నవంబర్ గోల్డెన్ మంత్..

- భారత క్రీడా చరిత్రలో స్వర్ణ అధ్యాయం
- 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ

02

# జనంలోకి.. సీఎం రేవంత్

- రెండేళ్ళ విజయాలు.. మూడేళ్ళ ప్రణాళికలు
- నేటి నుండి పట్టణ బాట
- అటు ప్రగతి మంత్రం.. ఇటు పంచాయతీ గెలుపు తంత్రం
- ఒక్క పర్యటనతో.. మూడు లక్ష్యాలు

### వారం రోజులు.. జిల్లాలన్నీ చుట్టేయనున్న ముఖ్యమంత్రి

ఓ వైపు గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు పర్యవేక్షణ.. మరోవైపు ప్రజల్లోకి రెండేళ్ళ విజయాలు

**డే-1:** మక్తల్, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా
పర్యటన- డిసెంబర్ 1, మధ్యాహ్నం 2గంటల నుండి 4గంటల వరకు
కార్యక్రమాలు- అభివృద్ధి పనులకు శంఖుస్థాపనలు, బహిరంగసభ

**డే-2:** కొత్తగూడెం పట్టణం, ఉమ్మడి ఖమ్మం జిల్లా
పర్యటన - డిసెంబర్ 2, మధ్యాహ్నం 2గంటల నుండి 4 గంటల వరకు
కార్యక్రమాలు- మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ భూమి పూజ, మహిళలతో భేటీ, సభ

**డే-3:** హుస్నాబాద్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా
పర్యటన - డిసెంబర్ 3, మధ్యాహ్నం 2గంటలకు
కార్యక్రమాలు- ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులకు భూమిపూజ, సభ

**డే-4:** ఆదిలాబాద్ పట్టణం, ఆదిలాబాద్ జిల్లా
పర్యటన - డిసెంబర్ 4, మధ్యాహ్నం 2గంటలకు
కార్యక్రమాలు- మునిసిపాలిటీలో శంఖుస్థాపన, బహిరంగసభ

**డే-5:** నర్సంపేట, ఉమ్మడి వరంగల్ జిల్లా
పర్యటన - డిసెంబర్ 5, మధ్యాహ్నం 2గంటలకు...
కార్యక్రమాలు- ఇంటిగ్రేటెడ్ పాఠశాల శంఖుస్థాపన , బహిరంగసభ

**డే-6:** దేవరకొండ, ఉమ్మడి నల్లగొండ జిల్లా
పర్యటన - డిసెంబర్ 6, మధ్యాహ్నం 2గంటలకు...
కార్యక్రమాలు- ఎద్దులజలాశయం పనుల శంఖుస్థాపన, బహిరంగసభ

**డే-7:** సిద్దిపేట, ఉమ్మడి మెదక్ జిల్లా
పర్యటన - డిసెంబర్ 7, మధ్యాహ్నం 2గంటలకు...
కార్యక్రమాలు - రూ.300కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. జనంలోకి వెళ్తున్నారు. రెండేళ్ళ విజయాలను, మూడేళ్ళ ప్రణాళికలను ప్రజల ముందుంచేందుకు అధినేత రెడీ అయ్యారు. సోమవారం సొంత జిల్లాలోని మక్తల్ నుండి పట్టణ యాత్రకు శ్రీకారం చుడుతున్న సీఎం చివరిగా రాజకీయ ప్రత్యర్థి కేసీఆర్ జిల్లా సిద్ధిపేటలో యాత్రను ముగించనున్నారు. ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనతో ఆయా జిల్లాల్లో పార్టీకి ఊపురానుంది. సీఎం పర్యటనతో పంచాయతీ ఎన్నికల్లో వార్ వన్ సైడ్ కానుందని అంచనా వేస్తున్నారు.

- మహా, హైదరాబాద్

- వివరాలు 2లో...



# పంచాయతీ 2.0
## రెండో విడత షురూ

- తొలివిడత 4,236 పంచాయతీలు.. 25,664మంది అభ్యర్థులు
- దరఖాస్తుల్లో సూర్యాపేట జిల్లా టాప్
- డిసెంబర్ 11న పోలింగ్.. పోటీల్లో చిత్రవిచిత్రాలు
- మేజర్ పంచాయతీల్లో సర్పంచ్ పదవికి ఫుల్ డిమాండ్
- రంగంలోకి రియల్లర్లు.. ఎన్ఆర్ ఐలు.. వ్యాపారులు




**హైదరాబాద్, మహా:** తెలంగాణలో పంచాయతీ వార్.. హీటెక్కింది. తొలివిడత పంచాయతీ నామినేషన్లు సజావుగా పూర్తి కాగా, రెండో విడత కూడా షురూ అయింది. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో డిసెంబర్ 11న జరగనున్న మొదటి దశ ఎన్నికల కోసం సర్పంచ్ పదవులకు భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తం 4,236 గ్రామ పంచాయతీలకు గాను 25,654 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,940 మంది తమ పత్రాలు సమర్పించడం విశేషం. అటు వార్డు సభ్యుల స్థానాలకు కూడా తీవ్రమైన పోటీ నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా 37,440 వార్డులకు 82,276 నామినేషన్లు దాఖలయ్యాయని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదివారం వెల్లడించింది. అధికారులు నామినేషన్ల పరిశీలన ప్రక్రియ చేపట్టారు. నామినేషన్లపై అభ్యంతరాలను డిసెంబర్ 1న స్వీకరించి, 2వ తేదీన పరిష్కరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు డిసెంబర్ 4 చివరి తేదీ. షెడ్యూల్ ప్రకారం తొలి విడత పోలింగ్ డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. రాష్ట్రంలో మొత్తం 12,728 గ్రామ పంచాయతీలకు, 1,12,242 వార్డులకు మూడు దశల్లో (డిసెంబర్ 11, 14, 17) ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన రూ.3,000 కోట్ల నిధులు 2026 మార్చి 31కి

మిగతా 2లో

### సూర్యాపేట జిల్లా టాప్

సర్పంచ్ పదవికి అత్యధిక దరఖాస్తులు సూర్యాపేట జిల్లాలో నమోదయ్యాయి. తొలి దశలో ఈ జిల్లాలోని 159 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. చివరి రోజు మాత్రమే 1,021 నామినేషన్లు రావడంతో, మొత్తం సంఖ్య 1,387కు చేరిందని అధికారులు తెలిపారు. వికారాబాద్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. ఇక్కడ 262 జీపీలకు నిర్వహించే ఎన్నికల కోసం మొత్తం 1,383 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించారు.

## నిత్య మారణ హోమం..!

- ప్రతిరోజూ 22 మరణాలు
- మృత్యువుకు మామూలైపోయిన రోడ్లు
- 2025 నవంబర్ వరకు 8 వేల ప్రాణాలు బలి
- డ్రైవర్ల నిర్లక్ష్యంతో 85% ప్రమాదాలు
- మెట్రో ప్రాంతాల్లో 60% మరణాలు
- అధికంగా బలవుతుంది 18-35 ఏళ్లలోపు వారే
- నల్గొండ నుంచి రంగారెడ్డి వరకు రహదారులపై నిఘా శూన్యం
- ప్రజల్లో పెరుగుతున్న భయాందోళన

02

## దంతెవాడలో 37 మంది మావోయిస్టుల సరెండర్

- హింసారహిత బస్తర్ దిశగా కీలక అడుగు
- ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంచలన విజయం
- రూ. 65 లక్షల బహుమతి మావోయిస్టులు లొంగుబాటు
- ప్రభుత్వ పునరావాస పథకాలే ప్రధాన కారణం

02

# అబ్బురపడేలా తెలంగాణ అభివృద్ధి

## 3 రీజియన్లుగా తెలంగాణ.. కోర్, ప్యూర్, రేర్ రీజియన్లుగా విభజన

- వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలలో ఎయిర్ పోర్టులు
- హైదరాబాద్ మచిలీపట్నం మధ్య గ్రీన్ ఫీల్డ్ హైవే
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025పై మంత్రులతో సమీక్ష



**హైదరాబాద్, మహా :** అబ్బురపడేలా తెలంగాణను అభివృద్ధి పరిచేందుకు తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025పై మంత్రులు అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ప్రజలకు అభివృద్ధి చెందిన తెలంగాణను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం పారదర్శక పాలసీలు తీసుకురాబోతున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడించారు. విజన్ డాక్యుమెంట్‌తో రెండు ప్రధానమైన అంశాలు ఉన్నాయని.. ఒకటి విజన్ అయితే.. ఇంకోటి స్ట్రాటజీ అని తెలిపారు. ఈ డాక్యుమెంట్ రూపకల్పనలో ప్రముఖులు, నిపుణుల సలహాలు తీసుకున్నట్లు చెప్పారు.

మిగతా 2లో



# జనంలోకి.. సీఎం రేవంత్

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి పర్యటనల ద్వారా ఆయా జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలపై ప్రభావం పడనుండగా, జిల్లా ప్రజలందరికీ విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే మూడేళ్ళు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని చెప్పదలుచుకున్నారు. సీఎం పర్యటన ద్వారా పంచాయతీ ఎన్నికల్లో పార్టీకి లాభించనుండగా, పట్టణాల పర్యటన ద్వారా త్వరలో జరగనున్న మునిసిపాలిటీలలో ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లవుతుంది. ప్రభుత్వ ప్రచారంతో పాటు పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల సన్నాహాన్ని కూడా సీఎం ఈ పర్యటన ద్వారా చెప్పనున్నారు.

**పర్యటన ఇలా..**

మొదటిరోజు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగే ఈ పర్యటనలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం అవుతారు. రెండున ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపాలిటీలో పర్యటిస్తున్నారు. అక్కడ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ భూమి పూజలో పాల్గొంటారు. అనంతరం సభలో పాల్గొంటారు.

మూడో తేదీన ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో పర్యటిస్తారు. అక్కడ రూ.44 కోట్లతో ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణంతో పాటు రూ.491.17 కోట్లతో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారు. నాలుగున ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పర్యటిస్తారు. పట్టణ మౌలిక వసతుల కల్పనా నిధి నుంచి రూ.18.70 కోట్ల విలువజేసే అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. అయిదో తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా నర్సంపేట్ మున్సిపాలిటీలో పర్యటిస్తారు. రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనానికి భూమి పూజతోపాటు సుమారు రూ.637 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆరో తేదీన ఉమ్మడి నల్గొండ జిల్లా దేవరకొండలో పర్యటిస్తారు. రూ.1,800 కోట్లతో చేపడుతున్న ఎద్దుల జలాశయం ప్రధాన కాలువ పనులతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. చివరగా సిద్దిపేటలో పర్యటిస్తారు. రూ.78 కోట్ల అంచనాలతో నిర్మించనున్న జిల్లా జైలు భవన నిర్మాణంతోపాటు రూ.300 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తారు. సీఎం పర్యటనతో కాంగ్రెస్ క్యాడర్ లో ఉత్సాహం నెలకొంది.

# పంచాయతీ 2.0

(మొదటిపేజీ తరువాయి)

ముగిగిపోనున్న నేపథ్యంలో, రాష్ట్ర కేబినెట్ ముందుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తుది తీర్పు వచ్చిన తర్వాతే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై నిర్ణయం తీసుకోనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకుండా, బీసీలకు 17.08 శాతం రిజర్వేషన్లు కేటాయించారు.

**రెండో విడత**

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల రెండో దశ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఆదివారం ప్రారంభమైంది. డిసెంబర్ 2వ తేదీ వరకు ఈ నామినేషన్లను స్వీకరిస్తారు. డిసెంబర్ 14వ తేదీన ఈ రెండో దశ ఎన్నికల పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 193 మండలాల్లోని 4,333 పంచాయతీలు, 38,350 వార్డులకు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు.

**తీవ్ర పోటీ**

పంచాయతీ ఎన్నికల్లో మేజర్ పంచాయతీలకు తీవ్రపోటీ నెలకొంది. అనేకమంది రియల్టర్లు, రియల్టర్ల మద్దతుదారులు బరిలో నిలిచారు. పలుచోట్ల తమ ఊరి సర్పంచ్ తమ చేతుల్లో ఉండాలని ఎన్ ఆర్ ఐ లు కూడా ఆర్థిక దన్ను అందించడం లేదా తమ కుటుంబ సభ్యులను నిలపడం చేశారు. పలువురు వ్యాపారులు, బడా బాబులు సొంత గ్రామాల్లో పట్టు కోసం, గౌరవం కోసం .. తమపై ఆధారపడే వారికి, గౌరవమిచ్చే వారికి నేనున్నానంటూ అభయమిస్తూ గెలుపుకు సహకరిస్తున్నారు. మేజర్ పంచాయతీల్లో పలు చోట్ల కోటిరూపాయల ఖర్చుకు కూడా నేతలు వెనుకాడడం లేదు.

**తదుపరి స్థానాల్లో ఇతర జిల్లాలు ఇలా ఉన్నాయి:**

**మహబూబాబాద్:** 155 గ్రామ పంచాయతీలకు 1,239 నామినేషన్లు

**కామారెడ్డి:** 167 జీపీలకు 1,224 నామినేషన్లు

**రంగారెడ్డి:** 174 గ్రామ పంచాయతీలకు 1,169 నామినేషన్లు

ఇక అత్యల్ప నామినేషన్లు ములుగు జిల్లాలో వచ్చాయి. ఈ జిల్లాలోని 48 జీపీలకు కేవలం 220 నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి.

# నేనూ ఐబొమ్మలో సిన్మాలు చూశా

### రవి ఒక యోధుడు, ఎన్‌కౌంటర్ చేస్తే వంద మంది పుడతారు

### సీపీఐ నారాయణ సంచలన వ్యాఖ్యలు.. సినిమా మాఫియాకు ఉరిశిక్ష వేయండి

**హైదరాబాద్, మహా:** తెలుగు రాష్ట్రాల రాజకీయ, సామాజిక రంగంలో ప్రస్తుతం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతిలో ఆదివారం మీడియాతో మాట్లాడిన సీపీఐ నేత నారాయణ, ఇటీవల అరెస్ట్ అయిన ఐబొమ్మ రవి, ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు హిడ్మా ఉదంతాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాలు, వ్యవస్థల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ ధరల మాఫియా పేరుతో ప్రజలను దోచుకుంటున్న సినీ పరిశ్రమను ఉద్దేశించి, 'ఉరి తీయాల్సింది ఐబొమ్మ రవిని కాదు, ఈ సినీ మాఫియాను ఉరి తీయండి, ఎన్‌కౌంటర్ చేయండి' అంటూ ఆయన సంచలన డిమాండ్ చేశారు. 'ఐబొమ్మ రవి లాంటి తెలివిగల వాడు, హిడ్మా లాంటి పోరాట యోధుడు ఈ వ్యవస్థల దోపిడీకి, మాఫియాకి వ్యతిరేకంగా, ప్రజలకు మేలు చేయాలనే తిరగబడ్డ యోధులు' అని ఆయన అభివర్ణించడం తీవ్ర చర్చకు దారితీసింది. వాస్తవానికి సినిమా టికెట్ రేట్లకు బయపడి తాను కూడా ఐబొమ్మలోనే సినిమాలు చూసేవాడినని ఆయన బహిరంగంగా అంగీకరించారు. ఒక వ్యక్తిని అడ్డుకుంటే సమస్య తీరదని, దోపిడీ ఉన్నంత కాలం తిరుగుబాటు కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. 'ఈరోజు మీరు ఐబొమ్మ రవిని అరెస్ట్ చేస్తే, ఎన్‌కౌంటర్ చేస్తే వంద మంది రవి లాంటివాళ్ళు పుడతారు. ఒక హిడ్మాను చంపి సంబర పడిపోతున్నారేమో, వెయ్యిమంది హిడ్మాలు పుడతారు. దోపిడీ ఉన్నంత కాలం నక్సలిజం ఉంటుంది,' అంటూ ఆయన తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. వ్యవస్థల్లో లోపాలు, డొల్లతనం ఇలాగే ఉంటే హిడ్మా రూపంలోనో, ఐబొమ్మ రవి లాంటి వాళ్ళ రూపంలోనో తిరుగుబాటు రాక తప్పదని, 'సివిల్ వార్ రాక తప్పదు' అని ఆయన హెచ్చరించారు. వ్యవస్థలు వ్యక్తుల చేతుల్లో బందీలై, దేశ వనరులన్నీ కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళితే ఇలాంటి తిరుగుబాట్లు అనివార్యమని ఆయన విశ్లేషించారు. కోట్లకు కోట్లు ఖర్చు పెట్టామని చెప్పి టికెట్ రేట్లు పెంచుకుంటామని సినిమా వాళ్ళు ప్రజల దగ్గర అడుక్కు తింటున్నారని, ప్రభుత్వాలు సిగ్గులేకుండా మద్దతు ఇవ్వడం సరికాదని సీపీఐ నారాయణ మండిపడ్డారు.

# అబ్బురపడేలా తెలంగాణ అభివృద్ధి

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ ఓఆర్ ఆర్ లోపల ప్రాంతంలో వివిధ విభాగాల పాలన ఉంది. అందుకే ఈ ప్రాంతం మొత్తాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా, ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఈ ప్రాంతాన్ని మ్యానుఫాక్చరింగ్ జోన్‌గా మారుస్తామని చెప్పారు. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్‌ను మార్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. నగరం నుంచి కాలుష్యకారకమైన పరిశ్రమలు బయటకు తరలిస్తామని అన్నారు. రాష్ట్రానికి మరిన్ని ఎయిర్‌పోర్టుల అవసరం ఉంది. గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, బుల్లెట్ రైళ్ల కోసం కేంద్రాన్ని ఒప్పిస్తున్నట్లు తెలిపారు. స్ట్రాటజీలో భాగంగా తెలంగాణను మూడు విభాగాలుగా తీసుకున్నాం. కోర్, ప్యూర్, రేర్ రీజియన్లుగా తెలంగాణను విభజించి అభివృద్ధి చేస్తాం. సమగ్రంగా ఈ మూడు రీజియన్ల అభివృద్ధిని సమగ్రంగా చేపడతాం.. అన్ని రంగాలను అభివృద్ధి చేసేలా మా విజన్ ఉంటుంది. ఎట్టి పరిస్థితుల్లో 2047 నాటికి రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ ఎకనామీగా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**మా పోటీ ఏపీతోనే ...**

మా పోటీ ఏపీ, కర్ణాటక లాంటి పక్క రాష్ట్రాలతో కాదు.. చైనా, జపాన్, జర్మనీ, సింగపూర్, సౌత్ కొరియా లాంటి అభివృద్ధి చెందిన దేశాలతో అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణకు మరో 4 విమానాశ్రయాలు తీసుకొస్తున్నాం. వరంగల్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, రామగుండంలో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు కానున్నాయి. హైదరాబాద్‌మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం కేంద్రంతో అంగీకారం కుదిరింది. హైవేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ ద్వారా పెట్టుబడులు ఆకర్షిస్తామని సీఎం రేవంత్ తెలిపారు.

# నిత్య మారణహోమం..!

## ప్రతిరోజూ 22 మరణాలు

- మృత్యువుకు మామూలైపోయిన రోడ్లు
- 2025 నవంబర్ వరకు 8 వేల ప్రాణాలు బలి
- డ్రైవర్ల నిర్లక్ష్యంతో 85% ప్రమాదాలు
- మెట్రో ప్రాంతాల్లో 60 శాతం మరణాలు
- అధికంగా బలవుతుంది 18-35 ఏళ్లలోపు వారే
- నల్గొండ నుంచి రంగారెడ్డి వరకు రహదారులపై నిఘా శూన్యం
- ప్రజల్లో పెరుగుతున్న భయాందోళన



**హైదరాబాద్, మహా:**

తెలంగాణ రాష్ట్రం రోడ్డు భద్రత విషయంలో అత్యంత భయానకమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట జరుగుతున్న ఘోర ప్రమాదాలు సమాజంలో తీవ్ర ఆందోళనను పెంచుతున్నాయి. ఈ ఏడాది 11 నెలల వ్యవధిలో సుమారు 27,500 కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. ఈ దురదృష్టకర ఘటనల్లో దాదాపు 8,000 మంది నిండు ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరం. దీనిని బట్టి, రాష్ట్ర రోడ్లపై ప్రతిరోజూ సగటున 22 మంది మృత్యువాత పడుతున్నట్లు స్పష్టమవుతోంది. అభివృద్ధి, వేగవంతమైన రవాణా అంటూ ముందుకు సాగుతున్న రాష్ట్రానికి ఈ స్థాయిలో ప్రాణనష్టం జరగడం, భవిష్యత్తు తరాలను కోల్పోవడం తీరని లోటు. ఈ పరిస్థితికి తక్షణమే అడ్డుకట్ట వేయాల్సిన సమయం ఆసన్నమైంది.

**ప్రమాదాలకు కారణమవుతున్న భయంకరమైన నిర్లక్ష్యం**

2025లో ప్రమాదాల సంఖ్య తీవ్రత పెరగడానికి ప్రధానంగా డ్రైవర్ల నిర్లక్ష్యమే కారణమని ట్రాఫిక్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దాదాపు 85 శాతం ప్రమాదాలు కేవలం డ్రైవర్ల తప్పుల వల్లే సంభవిస్తున్నాయని నివేదికలు ధృవీకరిస్తున్నాయి. ఇందులో అతివేగం ప్రధాన హంతకుడిగా నిలుస్తోంది. దీనికి తోడు మద్యం మత్తు, ప్రమాదకరమైన ర్యాష్ డ్రైవింగ్ కూడా మరణాల సంఖ్యను విపరీతంగా పెంచుతున్నాయి. ముఖ్యంగా, మొబైల్ ఫోన్ డ్రైవింగ్ కారణంగా దృష్టి మళ్లడం వల్ల కూడా ఈ ఏడాది అనేక ఘోర ప్రమాదాలు జరిగాయి. ఈ నిర్లక్ష్యపు పోకడల కారణంగా ఒకే కుటుంబానికి చెందిన పలువురు వ్యక్తులు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోవడం నిత్యకృత్యమైంది.

**జిల్లాల వారీగా పెను విషాదం**

- రాష్ట్రంలో అత్యధిక జనాభా, వాహనాల రద్దీ ఉన్న హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం (హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి) లోనే అత్యధిక మరణాలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన మొత్తం మరణాల్లో దాదాపు 60 శాతం ఈ ప్రాంతంలోనే చోటుచేసుకున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), ప్రధాన జాతీయ రహదారులు (ఎన్.హెచ్. 44, ఎన్.హెచ్. 65) కలిసే జంక్షన్ల వద్ద బ్లాక్‌స్పాట్స్ విస్తరిస్తూ మృత్యు కూపాలుగా మారాయి.
- నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం: విజయవాడ వైపు వెళ్లే రహదారి (ఎన్.హెచ్. 65)పై ప్రమాదాలు ఈ ఏడాది కూడా కొనసాగాయి. ముఖ్యంగా నల్గొండ జిల్లాలోని మిర్యాలగూడ వద్ద జరిగిన ఘోర ప్రమాదంలో ప్రైవేట్ బస్సు, కారు ఢీకొని ఐదుగురు మృతి చెందడం స్థానికులను కలచివేసింది. ఈ ప్రాంతాల్లో లారీలు, ట్రక్కులు వంటి భారీ వాహనాలు వేగ నియంత్రణ పాటించకపోవడమే ప్రధాన సమస్యగా ఉంది.
- యువతపై తీవ్ర ప్రభావం: 2025లో మరణించిన వారిలో 18 నుంచి 35 ఏళ్ల లోపు యువతే 55 శాతానికి పైగా ఉండటం అత్యంత బాధాకరం. వీరు ద్విచక్ర వాహనాలపై హెల్మెట్ ధరించకపోవడం, అతివేగం మరియు మద్యం సేవించి డ్రైవ్ చేయడం వంటి కారణాల వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ విధంగా రాష్ట్ర భవిష్యత్తుకు చెందిన యువత కోల్పోవడం సమాజానికి తీరని నష్టం.

**తక్షణ చర్యల ఆవశ్యకత**

ప్రమాదాల సంఖ్య ఈ స్థాయిలో పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. నవంబర్ 30 నాటికి కూడా ప్రమాదాల నివారణకు ఉద్దేశించిన రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దే పనులు మందకొడిగా సాగుతున్నాయి. స్పీడ్ గన్స్ నిర్వహణ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను మరింత కఠినంగా, అకస్మాత్తుగా నిర్వహించాల్సిన అవసరం ఉంది. రోడ్డు భద్రతపై కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, కఠినమైన శిక్షలు అమలు చేయడం ద్వారా మాత్రమే వాహనదారుల్లో భయాన్ని, బాధ్యతను పెంచగలమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ రోడ్లు రక్తం మరకలు కాకుండా ఉండాలంటే, ప్రభుత్వం, ప్రతి పౌరుడు ఈ విషయంలో పూర్తి స్థాయిలో సహకరించుకోవాలి.



## దంతెవాడలో 37 మంది

# మావోయిస్టుల సరెండర్

- హింసారహిత బస్తర్ దిశగా కీలక అడుగు
- ఛత్తీస్‌గఢ్ పోలీసుల సంచలన విజయం
- రూ. 65 లక్షల బహుమతి మావోయిస్టులు లొంగుబాటు
- ప్రభుత్వ పునరావాస పథకాలే ప్రధాన కారణం

**ఛత్తీస్‌గఢ్,మహా.** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దేశంలో నక్సలిజంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో, బస్తర్ ప్రాంతంలో శాంతి స్థాపన దిశగా మరో ముఖ్య పరిణామం నమోదైంది. దంతెవాడ జిల్లాలో ఏకంగా 37 మంది మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. లొంగిపోయిన ఈ మావోయిస్టుల్లో 27 మందిపై ప్రభుత్వాలు ప్రకటించిన రివార్డు మొత్తం రూ. 65 లక్షలు ఉండటం ఈ లొంగుబాటు యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతోంది. ఇది కేవలం సంఖ్యాపరమైన విజయమే కాకుండా, దక్షిణ బస్తర్‌లో మావోయిస్టుల బలం గణనీయంగా క్షీణించిందనడానికి స్పష్టమైన నిదర్శనం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ రీజియన్‌లోని దంతెవాడ జిల్లాలో ఆదివారం నాడు 37 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. దంతెవాడ ఎస్పీ కార్యాలయంలో జరిగిన ఈ లొంగుబాటు ప్రక్రియ రాష్ట్ర భద్రతా బలగాలకు ఒక పెద్ద విజయంగా పరిగణించబడుతోంది. లొంగిపోయిన వారిలో 12 మంది మహిళా మావోయిస్టులు కూడా ఉండటం విశేషం. లొంగిపోయిన 37 మందిలో 27 మంది క్రియాశీల మావోయిస్టులపై ప్రభుత్వం రివార్డు ప్రకటించింది. ఈ 27 మందిపై మొత్తం రివార్డు విలువ రూ. 65 లక్షలుగా ఉంది. వీరిలో కుమాలీ అలియాస్ అనితా మందావి, గీతా అలియాస్ లక్ష్మీ మద్కం, రంజన్ అలియాస్ సోమా మందావి, భీమా అలియాస్ జహాజ్ కల్మూ వంటి కీలక మావోయిస్టులు కూడా ఉన్నారు. రివార్డు ఉన్న అగ్రశ్రేణి మావోయిస్టులు ఈ విధంగా భారీ సంఖ్యలో లొంగిపోవడం మావోయిస్టు పార్టీ నిర్మాణానికి, కార్యకలాపాలకు కోలుకోలేని దెబ్బ అని అధికారులు అభిప్రాయపడుతున్నారు. వీరితో పాటు మరో 10 మంది మిలీషియా సభ్యులు కూడా ఆయుధాలు వదిలి ప్రభుత్వానికి మద్దతు తెలిపారు. మావోయిస్టులు హింసా మార్గాన్ని విడిచిపెట్టి లొంగిపోవడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అమలు చేస్తున్న 'పూనా మర్గం' (నూతన మార్గం) 'లోన్ వర్రాటు' (ఇంటికి తిరిగి రండి) వంటి పథకాలు ప్రధాన కారణంగా చెప్పబడుతున్నాయి. ప్రభుత్వ పునరావాస విధానంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, హింసాత్మక మార్గాన్ని వీడి శాంతియుత జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్నామని లొంగిపోయిన మావోయిస్టులు పేర్కొన్నారు. దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ సమక్షంలో ఈ లొంగుబాట్లు జరిగాయి. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక ప్రోత్సాహకంగా ఒక్కొక్కరికి రూ. 50,000 నగదును అందించింది. అంతేకాకుండా, వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబడుతుంది. వ్యవసాయంపై ఆసక్తి ఉన్నవారికి ప్రత్యేకంగా వ్యవసాయ భూమిని కూడా కేటాయించనున్నట్లు అధికారులు ప్రకటించారు. పోలీసుల సమాచారం ప్రకారం, గడచిన 23 నెలల్లో ఛత్తీస్‌గఢ్‌లో మొత్తం 2,200 మంది మావోయిస్టులు లొంగిపోయారు. దంతెవాడ జిల్లా ఒక్కదానిలోనే గత 20 నెలల్లో 165 మంది రివార్డు మావోయిస్టులతో సహా మొత్తం 508 మంది లొంగుబాట్లు నమోదు కావడం, బస్తర్ ప్రాంతంలో నక్సల్స్ ప్రాబల్యం తగ్గుముఖం పడుతోందని స్పష్టం చేస్తోంది. ప్రభుత్వ అభివృద్ధిప్రేరిత కార్యక్రమాలు, పోలీసుల నిరంతర ఆపరేషన్ల కలయిక ఈ సానుకూల మార్పుకు దోహదపడుతోందని అధికారులు తెలిపారు. శాంతియుత బస్తర్ దిశగా ఇది ఒక ముఖ్యమైన మలుపు అని భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

# నవంబర్ గోల్డెన్ మంత్

### భారత క్రీడా చరిత్రలో స్వర్ణ అధ్యాయం

### మన్ కీ బాత్ 128వ ఎపిసోడ్‌లో ప్రధాని మోదీ

**ఢిల్లీ, మహా:** భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు.

అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీఫైనల్‌లో ఇరాన్‌పై 33-21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35-28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి.

అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. "మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని ఆయన కొనియాడారు.

# ప్రేమ గెలిచింది, రిజర్వేషన్ నిలిచింది

- పెళ్లికి ముందే ప్రియురాలితో నామినేషన్ వేయించిన యువకుడు
- బీటెక్ విద్యార్థినిని సర్పంచ్ బరిలోకి దించిన ప్రేమ
- సంగారెడ్డిలో ఆసక్తి రేపుతున్న అనూహ్య ఘటన
- తాళ్లపల్లిలో 'ప్రేమజంట' నామినేషన్, మిస్సింగ్ కేసు, పోలీసుల చుట్టూ ఉత్కంఠ
- పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల కోసం సరికొత్త వ్యూహాలు!

**సంగారెడ్డి, మహా :** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. నామినేషన్ల ఘట్టంలో చోటు చేసుకుంటున్న విభిన్న దృశ్యాలు, అనూహ్య పరిణామాలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. పదవులపై ఉన్న మమకారం, రిజర్వేషన్ల కోసం నాయకులు అన సరిస్తున్న విభిన్న వ్యూహాలు ఈ ఎన్నికల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తున్నాయి. ఉన్నత ఉద్యోగాలను సైతం వదులుకుని అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న కొందరు అభ్యర్థులుంటే, మరి కొందరు రిజర్వేషన్ వర్గాలకు చెందినవారిని వివాహం చేసుకుని తమ రాజకీయ లక్ష్యాన్ని నెరవేర్చుకుంటున్నారు. ఈ కోవలోనే, తాజాగా ఒక ప్రేమజంట తమ వినూత్న నిర్ణయంతో అందరి దృష్టిని ఆకర్షించింది. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సంగారెడ్డి జిల్లా తాళ్లపల్లి గ్రామం ఇప్పుడు రాజకీయ, సామాజిక చర్చకు కేంద్ర బిందువుగా మారింది. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ అనే యువకుడు ఏకంగా తన ప్రేమను, రాజకీయ ఆశయాలను మేళవించి ఒక సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నాడు. తమ గ్రామంలో సర్పంచ్ స్థానం ఎస్సీ రిజర్వ్ కావడంతో, చంద్రశేఖర్ తన ప్రేయసి శ్రీజతో నామినేషన్ వేయించడం స్థానికంగా పెను ప్రకంపనలు సృష్టించింది. పెళ్లికి ముందే, బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న యువతిని గ్రామ నాయకత్వ పీఠం కోసం బరిలోకి దించడం గమనార్హం.

**పెళ్లి, నామినేషన్, మిస్సింగ్ కేసు**

ఈ అనూహ్య పరిణామం వెనుక ఒక హైడ్రామా చోటు చేసుకుంది. సర్పంచ్ పదవికి నామినేషన్ వేసిన వెంటనే, యువతి శ్రీజ తల్లిదండ్రులు తమ కూతురు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నామినేషన్ల వేళ రాజకీయ రంగు పులుముకున్న ఈ ప్రేమ వ్యవహారం ఒక్కసారిగా మిస్సింగ్ కేసు రూపంలో పోలీసుల వద్దకు చేరింది. మరోవైపు, ఈ ప్రేమజంట కూడా తాము ఇద్దరం ఇష్టంతోనే ఉన్నామని, తమకు ఎవరి నుంచి ఎలాంటి ఒత్తిడి లేదని స్పష్టం చేసింది. తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఈ ప్రేమజంట పోలీసులను ఆశ్రయించింది. "నేను చంద్రశేఖర్‌ను మనస్ఫూర్తిగా పెళ్లి చేసుకున్నాను. ఎవరి బలవంతం లేదు," అని శ్రీజ మీడియా ముందు ధైర్యంగా ప్రకటించింది. అంతేకాకుండా, తాళ్లపల్లి ఆడబిడ్డగా సర్పంచ్ బరిలోకి దిగుతున్నానని, గ్రామంలోని ప్రజల సహకారాన్ని కోరుకుంటున్నానని ఆమె విజ్ఞప్తి చేసింది.

**పదవుల కోసం సరికొత్త 'రిజర్వేషన్ల రాజకీయం**

తెలంగాణ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఎంతటి కీలక పాత్ర పోషిస్తున్నాయో ఈ తాజా ఘటన మరోసారి నిరూపించింది. తమ ఆశయాలను నెరవేర్చుకోవడం కోసం, అభ్యర్థులు రిజర్వేషన్ నిబంధనలను తమకు అనుకూలంగా మలచుకుంటూ సరికొత్త వ్యూహాలకు పదును పెడుతున్నారు. గతంలో రిజర్వేషన్ వర్గాలవారిని పెళ్లి చేసుకుని నామినేషన్లు వేయించిన సందర్భాలు ఉండగా, ఇప్పుడు ఏకంగా పెళ్లి బంధం ఏర్పడకముందే, కేవలం ప్రేమ బంధంతోనే ప్రియురాలిని ఎన్నికల బరిలోకి దించటం రాజకీయ పరిశీలకులను సైతం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఈ వ్యవహారం తాళ్లపల్లి గ్రామంలో, జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ప్రేమ, మరోవైపు ఎన్నికల రాజకీయం, ఇంకోవైపు తల్లిదండ్రుల ఆవేదన, పోలీసుల జోక్యం .. ఈ అంశాలన్నీ కలిసి ఈ పంచాయతీ ఎన్నికలను మరింత ఆసక్తికరంగా మార్చాయి. తాళ్లపల్లి గ్రామ ప్రజలు ఈ వినూత్న ప్రేమరాజకీయ జోడిని ఎలా ఆదరిస్తారన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది.



# రాంచీలో కోహ్లీ విశ్వరూపం

### .. సచిన్ ఆల్‌టైమ్ రికార్డు బద్దలు

**మహా :** ప్రపంచంలోని మేటి బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో సాటిలేని రారాజుగా నిలిచాడు. రాంచీ వన్డేలో సూపర్ శతకంతో రెచ్చిపోయిన విరాట్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 'ఆల్‌టైమ్ రికార్డు'ను బ్రేక్ చేశాడు. ఇదివరకూ వన్డేల్లో మాస్టర్ బ్లాస్టర్ సెంచరీలను దాటేసిన కింగ్ కోహ్లీ.. ఈసారి ఒక ఫార్మాట్‌లో అత్యధిక శతకాలతో సచిన్ రికార్డును బద్ధలుకొట్టాడు. రాంచీలో దక్షిణాఫ్రికా బౌలర్లపై ఊచకోతకు దిగిన అతడు వింటేజ్ కోహ్లీని తలపించాడు. ఆస్ట్రేలియా పర్యటనలో రెండు డకౌట్ల తర్వాత ఆఖరి వన్డేలో అజేయ అర్ధ శతకం బాదిన విరాట్.. ఇప్పుడు స్వదేశంలో సొంత ప్రేక్షకుల సమక్షంలో శతకంతో కదంతొక్కాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో సచిన్ 51 శతకాలతో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. అయితే.. కోహ్లీ వన్డేల్లో 52వ సారి మూడంకెల స్కోర్ అందుకొని అంతర్జాతీయ క్రికెట్ ఒక ఫార్మాట్లో అత్యధిక సెంచరీతో చరిత్ర సృష్టించాడు. ప్రస్తుతం విరాట్ అన్ని ఫార్మాట్లలో కలిపి 83 సెంచరీలు సాధించాడు. మొత్తంగా అంతర్జాతీయ క్రికెట్‌లో 7 వేల శతకం కోహ్లీ సాధించడం విశేషం. సచిన్ 100 శతకాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. క్రికెట్ గాడ్ అయిన సచిన్ టెస్టుల్లో 51, వన్డేల్లో 49 సార్లు మూడంకెల్ స్కోర్ నమోదు చేశాడు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు మోదీ, రాహుల్ గాంధీ

స్వయంగా ఆహ్వానించనున్న సీఎం రేవంత్

ఇతర రాష్ట్రాల సీఎంలు, కేంద్రమంత్రులు, జాతీయ ప్రముఖులను ఆహ్వానించాలని నిర్ణయం

**హైదరాబాద్, మహా :** డిసెంబర్ 8,9 తేదీల్లో ఫ్యూచర్ సిటీలో ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ సమ్మిట్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. కాగా ఈ సమ్మిట్‌కు ప్రధాని మోడీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో పాటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారు. సీఎం రేవంత్ స్వయంగా వీరిని ఆహ్వానించనున్నారు. వీరితో పాటు అన్ని రాష్ట్రాల సీఎంలు, కేంద్రమంత్రులను సైతం ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులకు సైతం ఆహ్వానపత్రికలు పంపనున్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆహ్వాన కమిటీలు ఏర్పాటు చేసి ఆహ్వానాల కోసం ప్రత్యేక వెబ్ సైట్, డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక ఇప్పటికే 4,500 మందికి ఆహ్వాన పత్రికలు జారీ చేసినట్టు సమాచారం. మరోవైపు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లేయర్, ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్ లకు సైతం ఆహ్వాన పత్రికలు పంపినట్టు తెలుస్తోంది.

# శతాబ్దాల నాటి కళకు పట్టం



**హైదరాబాద్, మహా:** దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతి నెల నిర్వహించే 'మన్ కీ బాత్' కార్యక్రమం కేవలం దేశంలోని సమస్యలనే కాకుండా, మారుమూల ప్రాంతాల్లో దాగి ఉన్న ప్రతిభను, అద్భుతమైన కళలను వెలుగులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో తాజాగా నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో తెలంగాణలోని కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రసిద్ధ 'సిల్వర్ ఫిలిగ్రీ' (వెండి తీగ పనితనం) కళాకృతుల గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించడం తెలుగు ప్రజలకు, ముఖ్యంగా కరీంనగర్ వాసులకు గర్వకారణంగా నిలిచింది. స్థానిక కళలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రధాని చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి.

**కరీంనగర్ కళావైభవానికి ప్రధాని జేజేలు**

మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ భారతీయ హస్తకళల గొప్పతనాన్ని వివరిస్తూ, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ కళ గురించి ప్రత్యేకంగా మాట్లాడారు. ఎంతో సున్నితమైన వెండి తీగలతో ఆభరణాలు, వస్తువులను తయారు చేసే ఈ కళకు శతాబ్దాల చరిత్ర ఉందని, ఆధునిక కాలంలో కూడా ఈ కళను బ్రతికించుకుంటున్న అక్కడి కళాకారుల అంకితభావం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. తరాలు మారుతున్నా, పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఈ విద్యను కాపాడుకుంటూ, కొత్త పోకడలతో ముందుకు సాగుతున్న కరీంనగర్ కళాకారుల నైపుణ్యాన్ని దేశం మొత్తం గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా 'వోకల్ ఫర్ లోకల్' (స్థానిక ఉత్పత్తులకు మద్దతు) అనే నినాదంలో భాగంగా, మన దేశీయ కళలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని మోదీ గుర్తుచేశారు. కరీంనగర్ ఫిలిగ్రీకి భౌగోళిక గుర్తింపు లభించడం ఈ కళ విశిష్టతకు నిదర్శనమని, ఇలాంటి కళాకృతులను కానుకలుగా ఇవ్వడం లేదా దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా కళాకారులకు ఆర్థికంగా దన్నుగా నిలిచినట్లవుతుందని ఆయన సూచించారు. విదేశీ వస్తువుల మోజులో పడి మన ఘనమైన సంస్కృతికి అద్దం పట్టే ఇలాంటి అపురూపమైన కళలను మర్చిపోకూడదని ఆయన హితవు పలికారు. ప్రధాని ప్రస్తావనతో కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ ఆఫ్ కరీంనగర్ సొసైటీ సభ్యులు, స్థానిక కళాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దేశ అత్యున్నత నాయకుడు తమ కళను గుర్తించి, జాతి జనులందరికీ పరిచయం చేయడం తమకు దక్కిన అరుదైన గౌరవంగా వారు భావిస్తున్నారు. గతంలో జీ20 సదస్సులోనూ, ఇతర అంతర్జాతీయ వేదికలపై విదేశీ అతిథులకు కరీంనగర్ ఫిలిగ్రీ వస్తువులను బహుమతులుగా ఇచ్చిన సందర్భాలను ఈ సందర్భంగా పలువురు గుర్తుచేసుకుంటున్నారు. ప్రధాని తాజా వ్యాఖ్యలతో ఈ కళకు అంతర్జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు లభిస్తుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. చివరగా, కరీంనగర్ అంటే కేవలం రాజకీయ చైతన్యమే కాదు, అద్భుతమైన కళలకు కాణాచి అని మన్ కీ బాత్ ద్వారా మరోసారి రుజువైంది. వెండి తీగలను అద్భుతమైన కళాఖండాలుగా మలిచే కరీంనగర్ చేతివృత్తుల వారి నైపుణ్యం, ప్రధాని ప్రశంసలతో కొత్త ఉత్సాహాన్ని నింపుకుంది. ఈ స్ఫూర్తితో అంతరించిపోతున్న ఎన్నో గ్రామీణ కళలకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వాలు, ప్రజలు కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# బీదర్-మహేశ్వరం విద్యుత్ లైన్ వివాదం

రైతులకు అన్యాయం జరుగకుండా చూడాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్‌కు ఎంపీ రవిచంద్ర సూచనలు



**రంగారెడ్డి,మహా:** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల రైతుల భూములకు నష్టం కలిగించే అవకాశం ఉన్న బీదర్ , మహేశ్వరం 765 కెవి హై టెన్షన్ విద్యుత్ లైన్ అంశంపై బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లు అత్యంత చురుకుగా వ్యవహరిస్తున్నారు. రైతుల ఆందోళనలను పరిగణలోకి తీసుకుని, వారి విలువైన భూములకు, పంట పొలాలకు ఎలాంటి నష్టం జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సెంట్రల్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులను గట్టిగా కోరారు. ముఖ్యంగా, రైతులు కేటీఆర్ సూచన మేరకు ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విన్నవించుకున్న అనంతరం, మంత్రి ఆదేశాల మేరకు పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు చర్యలు ప్రారంభించారు. ఈ క్రమంలో, కార్పొరేషన్ సీజీఎం బిపిన్ బీహారీ రథ్ తదితర సీనియర్ అధికారులు ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ రవిచంద్ర క్యాంప్ కార్యాలయంలో సుమారు మూడు గంటల పాటు ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, రైతుల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎంపీ వద్దిరాజు, జైపాల్ యాదవ్ లు విద్యుత్ లైన్ మ్యాపులను పరిశీలించి, రైతులకు అన్యాయం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, సూచనలు చేశారు. రైతులకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని, వారి ఆవేదనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సీజీఎం బిపిన్ బీహారీ రథ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

# షాపూర్‌నగర్ దారుణం..!

- నర్సరీ చిన్నారిపై 'ఆయా' పైశాచిక దాడి
- కాలుతో తొక్కిన వైనం
- యాజమాన్యం నిర్లక్ష్యంపై ఆగ్రహం
- 'చిన్న ఇష్యూ' అన్న స్కూల్ యాజమాన్యం



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్ ప్రాంతంలో ఉన్న పూర్ణిమా స్కూల్‌లో నర్సరీ చదువుతున్న ఓ చిన్నారిపై జరిగిన పైశాచిక దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. మనుషులు అనేవారు ఇంత కర్కశంగా ప్రవర్తిస్తారా అనిపించే విధంగా, అదే స్కూల్‌లో పనిచేస్తున్న ఆయా.. ఆ పసిబిడ్డను కింద పడేసి కాలుతో తొక్కి, అమానవీయంగా దాడి చేసింది. ఈ దారుణ దృశ్యాలు పక్క బిల్డింగ్ నుంచి రికార్డు కావడం వల్ల విషయం వెలుగులోకి వచ్చింది. శత్రుత్వం ఉన్నవారు కూడా ఇంత దారుణంగా ప్రవర్తించరేమో అనిపించేలా జరిగిన ఈ ఘటన, ఆ చిన్నారి తల్లిదండ్రులను, సమాజాన్ని తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఒడిశా రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చి, కూలి పనులు చేసుకుంటున్న ఆ చిన్నారి తల్లిదండ్రులు తమ బిడ్డకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని కలలో కూడా ఊహించి ఉండరు. ఆ చిన్నారి తల్లి కూడా అదే పూర్ణిమా స్కూల్‌లో ఆయాగా పనిచేస్తోంది. పిల్లలను దించడానికి ఆమె బస్సులో వెళ్లిన సమయంలోనే, మరో ఆయా ఈ కిరాతక దాడికి పాల్పడింది. అత్యంత దారుణంగా, ఆ పసిబిడ్డను కింద పడేసి, కాళ్లతో తొక్కిన దృశ్యాలు చూసిన ప్రతి ఒక్కరి హృదయం చివుక్కుమంది. ఆ చిన్నారిని కొడుతున్న దృశ్యాలను పక్క భవనం నుంచి ఒక యువకుడు తన ఫోన్‌లో రికార్డు చేయడంతో ఈ విషయం బయటి ప్రపంచానికి తెలిసింది. దాడి జరిగిన తర్వాత నుంచి ఆ చిన్నారి తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తమ బిడ్డకు జరిగిన అన్యాయం గురించి స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా, వారు మరింత నిర్లక్ష్యంగా స్పందించారు. "చిన్న ఇష్యూని ఎందుకు సాగదీస్తున్నావు" అంటూ ఆ తల్లిని ప్రశ్నించడం యాజమాన్యం బాధ్యతారాహిత్యాన్ని తేటతెల్లం చేసింది. దీంతో చేసేదేమీ లేక ఆ తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. పసిబిడ్డపై దాడికి పాల్పడిన ఆ ఆయాపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఇంతటి దారుణాన్ని 'చిన్న విషయం' అంటూ నిర్లక్ష్యం చేసిన స్కూల్ యాజమాన్యంపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన పాఠశాలల్లో పిల్లల భద్రతకు సంబంధించిన లోపాలను ఎత్తిచూపుతూ, సమాజంలో భయాన్ని పెంచుతోంది.

# నాలుగేళ్ల నిరీక్షణకు తెర..

## భారత గడ్డపై రష్యా అధినేత

- ప్రపంచం ఉలిక్కిపడేలా మోదీ మాస్టర్ ప్లాన్!
- యుద్ధ మేఘాల మధ్య దౌత్య ప్రళయ గర్జన!
- ఆసియా రాజకీయ ముఖచిత్రాన్ని శాశ్వతంగా మార్చే చారిత్రక ఘట్టం!
- ఆంక్షల కోటలను బద్దలు కొట్టి.. మిత్రుడి కోసం ఢిల్లీకి వస్తున్న పుతిన్, డ్రాగన్‌కు ఇక నిద్రలేనట్టేనా?
- రక్షణ రంగంలో విప్లవం, వాణిజ్యంలో సరికొత్త శకం.. మోదీ-పుతిన్ ఏకాంత చర్చల్లో దాగి ఉన్న రహస్యాలివే!
- ప్రపంచం ఒకవైపు, భారత్-రష్యా మరొకవైపు
- మోదీ ఆలింగనంతో మారనున్న గ్లోబల్ పాలిటిక్స్!



**హైదరాబాద్, మహా:** ప్రపంచ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరంటారు కానీ, భారత్‌రష్యా మైత్రి ఆ నానుడిని ఎప్పుడో తిరగరాసింది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ప్రపంచం మొత్తం రష్యాను వెలివేసినా, భారత్ మాత్రం తన పాత మిత్రుడి చేయి వదలలేదు. ఇప్పుడు ఆ బంధాన్ని శిఖరాగ్రానికి చేర్చడానికి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వయంగా భారత్‌కు తరలివస్తున్నారు. దాదాపు నాలుగు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత పుతిన్ భారత గడ్డపై కాలుమోపనుండటం సాధారణ విషయం కాదు. డిసెంబర్ 2021లో చివరిసారిగా ఢిల్లీ వచ్చిన పుతిన్, ఆ తర్వాత యుద్ధం, అంతర్జాతీయ అరెస్టు వారెంట్లు, భద్రతా కారణాల రీత్యా విదేశీ పర్యటనలకు దూరంగా ఉన్నారు. అలాంటిది ఇప్పుడు అన్ని అడ్డంకులను, అమెరికా హెచ్చరికలను పక్కనపెట్టి మోదీతో భేటీకి వస్తున్నారంటే, తెర వెనుక జరుగుతున్న కథ మామూలుగా ఉండదనే విషయం స్పష్టమవుతుంది* భారతదేశ రాజధాని ఢిల్లీ వేదికగా మరోసారి ప్రపంచ రాజకీయాలు వేడెక్కబోతున్నాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన ఖరారవ్వడంతో పాశ్చాత్య దేశాల్లో ఆందోళన మొదలైతే, ఆసియాలో ఆసక్తి పెరిగింది. సరిగ్గా నాలుగు సంవత్సరాల క్రితం, అంటే 2021 డిసెంబర్‌లో పుతిన్ చివరిసారిగా భారత్‌ను సందర్శించారు. ఆ తర్వాత ప్రపంచం చాలా మారింది. ఉక్రెయిన్ యుద్ధం రష్యాను ఆర్థికంగా, దౌత్యపరంగా ఇబ్బందుల్లోకి నెట్టింది. కానీ, భారత్ మాత్రం రష్యాకు అండగా నిలిచింది. ఇప్పుడు పుతిన్ రాకతో ఆ నమ్మకం మరోసారి రుజువు కాబోతోంది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్ట్ పుతిన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసినప్పటికీ, భారత్ ఆ ఒప్పందంలో సభ్యదేశం కాకపోవడం పుతిన్‌కు కలిసొచ్చే అంశం. ఏది ఏమైనా, తన భద్రతను పణంగా పెట్టి మరీ పుతిన్ భారత్‌కు వస్తున్నారంటే, రష్యాకు భారత్ ఎంత అవసరమో, భారత్‌కు రష్యా ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ఈ పర్యటనలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం రక్షణ రంగం. భారత సైన్యం వద్ద ఉన్న ఆయుధాల్లో ఇప్పటికీ 60 శాతానికి పైగా రష్యా తయారీవే ఉన్నాయి. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా నుండి రావాల్సిన ఎస్400 క్షిపణి వ్యవస్థల సరఫరాలో జాప్యం జరిగింది. విడిభాగాల కొరత కూడా వేధిస్తోంది. ఇప్పుడు పుతిన్ రాకతో ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. కేవలం ఆయుధాల కొనుగోలుకే పరిమితం కాకుండా, రష్యా సాంకేతిక పరిజ్ఞానాన్ని భారత్‌కు బదిలీ చేయడం, భారత్‌లోనే అధునాతన ఆయుధాలను ఉమ్మడిగా ఉత్పత్తి చేయడంపై కీలక ఒప్పందాలు జరగనున్నాయి. ముఖ్యంగా సుఖోయ్ విమానాల ఆధునీకరణ, భవిష్యత్తులో బ్రహ్మోస్ క్షిపణుల ఎగుమతులపై కూడా ఇరువురు నేతలు చర్చించే అవకాశం ఉంది. ఇది పరోక్షంగా చైనా, పాకిస్తాన్‌లకు హెచ్చరిక వంటిదే. ఆర్థిక , ఇంధన రంగాల్లో ఈ భేటీ ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుంది. గత రెండేళ్లుగా రష్యా నుండి చౌకగా చమురును కొనుగోలు చేయడం ద్వారా భారత్ లక్షల కోట్లు ఆదా చేసింది. అయితే, ఈ వాణిజ్యంలో చెల్లింపుల సమస్యలు తలెత్తుతున్నాయి. రూపాయిరూబుల్ విధానంలో ఉన్న చిక్కుముళ్లను విప్పడానికి, చెల్లింపుల కోసం ఒక కొత్త, స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి ఈ పర్యటన వేదిక కానుంది. అంతేకాకుండా, తమిళనాడులోని కుడంకుళం అణు విద్యుత్ కేంద్రంలో మిగిలిన రియాక్టర్ల నిర్మాణాన్ని వేగవంతం చేయడం, కొత్తగా మరో అణు విద్యుత్ కేంద్రాన్ని నిర్మించే ఒప్పందాలపై సంతకాలు జరిగే అవకాశం ఉంది. రష్యా తన చమురు, గ్యాస్‌ను భారత్‌కు దీర్ఘకాలిక ప్రాతిపదికన సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంది, ఇది భారత్ ఇంధన భద్రతకు ఢోకా లేకుండా చేస్తుంది. భౌగోళిక రాజకీయాల పరంగా చూస్తే, ఈ పర్యటన చైనాకు పెద్ద షాక్ అనే చెప్పాలి. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా.. చైనాపై ఎక్కువగా ఆధారపడుతోందన్న వాదనలు ఉన్నాయి. కానీ, పుతిన్ ఢిల్లీకి రావడం ద్వారా తాము ఎవరికీ లొంగిపోలేదని, భారత్ తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన మిత్రదేశమని స్పష్టం చేస్తున్నారు. రష్యాచైనా కూటమి బలపడటం భారత్‌కు మంచిది కాదు, అలాగే రష్యా పూర్తిగా చైనా వైపు వెళ్లడం కూడా భారత్‌కు ఇష్టం లేదు. అందుకే మోదీ, పుతిన్‌ను దగ్గర చేసుకుంటూ చైనాకు చెక్ పెడుతున్నారు. అలాగే, చెన్నైవ్లాడివోస్టాక్ మారిటైమ్ కారిడార్‌ను వేగవంతం చేయడం ద్వారా వాణిజ్య మార్గాలను విస్తరించాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. చివరగా, ఈ పర్యటనలో ఉక్రెయిన్ యుద్ధం ప్రస్తావన రాకుండా ఉండదు. భారత్ మొదటి నుంచి చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని చెబుతోంది. ప్రధాని మోదీ స్వయంగా పుతిన్‌తో ఈ విషయంపై చర్చించి, యుద్ధ విరమణ దిశగా ఏమైనా చొరవ తీసుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, నాలుగు సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ శిఖరాగ్ర భేటీ రెండు దేశాల బంధాన్ని ఫెవికాల్ కంటే గట్టిగా మార్చబోతోంది. అమెరికా ఆంక్షలు, పాశ్చాత్య దేశాల ఒత్తిళ్లు ఈ స్నేహాన్ని ఏమీ చేయలేవని ఢిల్లీ వేదికగా మోదీపుతిన్ ప్రపంచానికి చాటిచెప్పబోతున్నారు. రాబోయే రోజుల్లో ప్రపంచ రాజకీయ ముఖచిత్రం మారబోతోందనడానికి ఈ పర్యటనే నిలువెత్తు సాక్ష్యం.

# ఢిల్లీలో రాజకీయ భూకంపం

## సోనియా, రాహుల్‌లపై క్రిమినల్ కేసు నమోదు

- గాంధీ కుటుంబం చుట్టూ బిగుస్తున్న ఉచ్చు
- రూ. 2000 కోట్ల ఆస్తుల గోల్ మాల్?
- తల్లీకొడుకులపై 'భారీ కుట్ర' అభియోగాలు!
- నేషనల్ హెరాల్డ్ కేసులో ఢిల్లీ పోలీసుల సంచలన ఎఫ్ఐఆర్!
- ఇక అరెస్ట్ తప్పదా? ఈడీ తర్వాత ఎంట్రీ ఇచ్చిన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్!

**హైదరాబాద్, మహా:** దేశ రాజధాని నడిబొడ్డున ఊహించని రాజకీయ విస్ఫోటం సంభవించింది. చలికాలం చలిని మించిపోయేలా ఢిల్లీ పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగిపోయింది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు గంటలు లెక్కిస్తున్న తరుణంలో, దేశంలోని అత్యంత శక్తివంతమైన రాజకీయ కుటుంబంపై పిడుగు లాంటి వార్త పడింది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మెడపై కత్తి వేలాడుతోంది. ఇన్నాళ్లు ఈడీ విచారణతో ఉక్కిరిబిక్కిరి అయిన గాంధీ కుటుంబానికి, ఇప్పుడు ఢిల్లీ పోలీసుల రూపంలో ఊహించని గండం ఎదురైంది. ఇది సాధారణ కేసు కాదు, వేల కోట్ల ఆస్తుల వ్యవహారంలో జరిగిన 'భారీ కుట్ర' అంటూ నమోదైన ఎఫ్ఐఆర్ దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. దేశ రాజకీయ చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, యువనేత రాహుల్ గాంధీలపై ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం అత్యంత తీవ్రమైన సెక్షన్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ఒక సంచలనం. ఇప్పటివరకు కేవలం మనీ లాండరింగ్ ఆరోపణలకే పరిమితమైన నేషనల్ హెరాల్డ్ కేసు, ఇప్పుడు క్రిమినల్ మలుపు తిరిగింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అందించిన పక్కా సమాచారం, సాక్ష్యాధారాల ఆధారంగా పోలీసులు రంగంలోకి దిగారు. భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 120బి కింద నేరపూరిత కుట్ర, సెక్షన్ 420 కింద చీటింగ్, సెక్షన్ 406 కింద నమ్మకద్రోహం వంటి గట్టి సెక్షన్లను ప్రయోగించడం చూస్తుంటే, దర్యాప్తు సంస్థలు ఈ కేసును ఎంత సీరియస్‌గా తీసుకున్నాయో అర్థమవుతోంది. ఈ మొత్తం వ్యవహారం అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌కు చెందిన వేల కోట్ల ఆస్తులను 'యంగ్ ఇండియన్' అనే సంస్థ ద్వారా అతి తక్కువ ధరకు చేజిక్కించుకున్నారనే ఆరోపణల చుట్టూ తిరుగుతోంది. దేశ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలతో, ప్రజల విరాళాలతో ఏర్పడిన నేషనల్ హెరాల్డ్ పత్రికకు చెందిన సుమారు రూ. 2000 కోట్ల విలువైన ఆస్తులను, కేవలం రూ. 50 లక్షలు చెల్లించి సోనియా, రాహుల్ గాంధీలు తమ సొంతం చేసుకున్నారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొనడం గమనార్హం. ఇది కేవలం ఆర్థిక అవకతవక కాదు, పక్కా ప్రణాళికతో జరిగిన దోపిడీ అని, ఇందులో సోనియా, రాహుల్‌లతో పాటు దివంగత నేతలు మోతీలాల్ వోరా, ఆస్కార్ ఫెర్నాండెజ్ వంటి వారు కూడా భాగస్వాములని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యంగ్ ఇండియన్ సంస్థలో మెజారిటీ వాటాలు గాంధీ కుటుంబం చేతిలోనే ఉండటం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది. పార్లమెంట్ సమావేశాలకు సరిగ్గా ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం వెనుక పెద్ద రాజకీయ వ్యూహమే దాగి ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కచ్చితంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేసిన 'పొలిటికల్ మాస్టర్ స్ట్రోక్' అని కాంగ్రెస్ వర్గాలు మండిపడుతున్నాయి. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు, అదానీ వంటి అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా దారి మళ్లించేందుకే మోదీ సర్కార్ ఈ కుట్రకు తెరలేపిందని కాంగ్రెస్ నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అయితే, చట్టం ఎవరికీ చుట్టం కాదని, అవినీతికి పాల్పడిన వారు ఎంతటివారైనా జైలు ఊచలు లెక్కపెట్టాల్సిందేనని బీజేపీ నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఈ కొత్త ఎఫ్ఐఆర్ నమోదుతో రానున్న రోజుల్లో ఢిల్లీలో హైడ్రామా నడవబోతోంది. సోనియా, రాహుల్‌లను పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది. ఒకవేళ అరెస్టుల వరకు పరిస్థితి వెళ్తే దేశవ్యాప్తంగా అల్లర్లు చెలరేగే ప్రమాదం లేకపోలేదు. మొత్తానికి, ఒకవైపు ఈడీ, మరోవైపు సీబీఐ, ఇప్పుడు ఢిల్లీ పోలీసులు... ఇలా ముప్పేట దాడితో గాంధీ కుటుంబం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ఈ 'చక్రబంధం' నుంచి సోనియా, రాహుల్ ఎలా బయటపడతారు? ఈ రాజకీయ చదరంగంలో అంతిమ విజయం ఎవరిది? అనేది కాలమే నిర్ణయించాలి.

# ఢిల్లీలో కలకలం

- పాకిస్థాన్ గ్యాంగ్‌స్టర్ల ఉగ్రవాద మాడ్యూల్ అరెస్ట్
- భారత్ అంతటా పాకిస్థాన్ నిఘా సంస్థ విస్తరణ
- ముగ్గురు ఉగ్రవాద మద్దతుదారులను పట్టుకున్న ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ, మహా:** ఢిల్లీలో ఇటీవల జరిగిన ఆత్మాహుతి దాడి కలకలం ఇంకా సద్దుమణగకముందే, దేశ రాజధానిలో మరోసారి ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన కీలక పరిణామం చోటుచేసుకుంది. గ్యాంగ్‌స్టర్లుగా ముసుగు వేసుకుని ఉగ్రవాదులుగా మారిన ముగ్గురు అనుమానితులను ఢిల్లీ స్పెషల్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. పాకిస్థాన్ నిఘా సంస్థ ఆదేశాల మేరకు ఈ మాడ్యూల్ పనిచేస్తున్నట్టు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఢిల్లీ స్పెషల్ పోలీసు వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ ఉగ్రవాద మాడ్యూల్ అంతర్జాతీయంగా విస్తరించి ఉంది. అంతేకాకుండా, ఇది భారత్‌లోని అనేక రాష్ట్రాలలో తన కార్యకలాపాలను విస్తరించి, యువకులను ఉగ్రవాద కార్యకలాపాల వైపు ఆకర్షిస్తున్నట్టు గుర్తించారు. ఈ మాడ్యూల్‌కు ప్రధాన నేతగా పాకిస్థాన్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ షాజాద్ భట్టి వ్యవహరిస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. భట్టి సోషల్ మీడియా, ఇతర పరిచయాల ద్వారా యువతను నియమించుకొని, వారిని ఉగ్ర కార్యకలాపాలకు ఉసిగొల్పుతున్నట్టు గుర్తించారు. అరెస్టయిన ముగ్గురిలో ఒకరు పంజాబ్‌కు చెందిన హర్గన్ ప్రీత్ సింగ్, మరొకరు మధ్యప్రదేశ్‌కు చెందిన వికాస్ ప్రజాపతి, మూడో వ్యక్తి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఆరిఫ్ గా పోలీసులు గుర్తించారు. వీరంతా ఇటీవల నవంబర్ 25వ తేదీన పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ సిటీ పోలీస్ స్టేషన్ ముందు హ్యాండ్ గ్రెనేడ్‌ను విసిరినట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ దాడి ఘటనపై పోలీసులు తీవ్రంగా దృష్టి సారించారు. గురుదాస్‌పూర్ ఘటన జరిగిన స్థలంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి, వారి కదలికలను ట్రాక్ చేసి ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టులు ఉగ్రవాద మాడ్యూల్‌ను ఛేదించడంలో ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ల ముసుగులో యువతను ఉగ్రవాదం వైపు మరల్చే ఈ నూతన పద్ధతిపై అన్ని రాష్ట్రాల పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

# జీహెచ్ఎంసీ ఇక జీహెచ్ఏ

ప్రస్తుతం ఉన్న డివిజన్లకు రెట్టింపు డివిజన్లు.. కొత్త మునిసిపాలిటీలు, పురపాలికల విలీనంతో మారనున్న రూపు రేఖలు

**హైదరాబాద్, మహా :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (హెచ్ఎంసీ) ఇక నుంచి గ్రేటర్ హైదరాబాద్ అథారిటీ(జీహెచ్ఏ)గా రూపాంతరం చెందనుంది. ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ పరిధిని విస్తరించి శివారు 27 పట్టణ స్థానిక సంస్థలను విలీనం చేయడం ద్వారా బృహత్ హైదరాబాద్ నగరాన్ని ఏర్పాటు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ విలీన ప్రక్రియ తర్వాత జీహెచ్ఎంసీ పరిధిలో ప్రస్తుతం ఉన్న 150 డివిజన్లు సుమారు 300 డివిజన్లకు పెరిగే అవకాశం ఉంది. శివారు ప్రాంతాల నుంచి విలీనం కానున్న పట్టణ స్థానిక సంస్థల పరిధిలో మరో సుమారు వంద డివిజన్లు ఉన్నాయి. ఈ భారీ మార్పుకు సంబంధించిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలను అధికారులు శరవేగంగా సిద్ధం చేస్తున్నారు. విలీన ప్రక్రియ పూర్తయ్యాక ప్రస్తుతం ఉన్న డివిజన్లన్నింటినీ పునర్ వ్యవస్థీకరించనున్నారు. ఈ సందర్భంగా పరిపాలనాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జోనల్ కమిషనర్లు, ఉన్నతాధికారులు శనివారం ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను సమర్పించారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 అసెంబ్లీ స్థానాలు, 6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 డివిజన్లు ఉన్నాయి. వీటిలో కొన్ని డివిజన్లు రెండు లేదా మూడు అసెంబ్లీ స్థానాల్లో విస్తరించి ఉండటం వలన పరిపాలన సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి, డివిజన్ల హద్దులు తప్పనిసరిగా ఒకే అసెంబ్లీ స్థానం పరిధిలో ఉండేట్టుగా పునర్విభజన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు తుది నిర్ణయం తీసుకున్నారు. ఈ డివిజన్ల పునర్విభజన అనంతరం, పరిపాలనా సౌలభ్యం కోసం సర్కిళ్లు, జోన్లను కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బృహత్ నగర ముఖచిత్రాన్ని రూపొందించే పనిలో జీహెచ్ఎంసీ యంత్రాంగం నిమగ్నమైంది. ఎంసీఆర్ హెచ్ఆర్ డీలోని సీజీజీ (సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్)లో జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన నివేదికలు, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు స్వయంగా శనివారం రెండు సార్లు సీజీజీని సందర్శించి, అధికారులు రూపొందించిన ప్రతిపాదనలు, ఇతర పత్రాలను పరిశీలించారు. శివారు పురపాలికలు, నగరపాలిక కమిషనర్లు కూడా తమ స్థానిక సంస్థల పూర్తి సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించారు. విలీన ప్రక్రియకు సంబంధించిన ఆర్డినెన్స్ పత్రాలు ఇప్పటికే రాజ్ భవన్‌కు చేరినట్లు సమాచారం, గవర్నర్ సంతకం చేయడమే తరువాయిగా ఉంది. నగర శివార్లలోని 20 పురపాలికలు, ఏడు నగరపాలక సంస్థలు జీహెచ్ఎంసీలో విలీనమవుతుండటంతో సదరు మున్సిపల్ కార్యాలయాలన్నీ ఇక నుంచి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయాలుగా రూపాంతరం చెందనున్నాయి. అక్కడి పురపాలక కమిషనర్లు.. జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఎల్‌బీ నగర్ జోన్ లో ప్రస్తుతమున్న సర్కిళ్లు కాప్రా, ఉప్పల్, హయత్‌నగర్, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్‌లు ఉన్నాయి. కొత్తగా ఆదిబట్ల, మీర్‌పేట్, బడంగ్‌పేట, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట్, పీర్జాదిగూడ, పోచారం, ఘట్‌కేసర్, బోడుప్పల్‌లు చేరనున్నాయి. సికింద్రాబాద్ జోన్‌లో ప్రస్తుతం ముషీరాబాద్, అంబర్‌పేట్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, బేగంపేట సర్కిళ్ళు ఉండగా, కొత్తగా తూంకుంట, నాగారం, దమ్మాయిగూడ, జవహర్‌నగర్‌లో తోడవనున్నాయి. కూకట్‌పల్లి జోన్‌లో ప్రస్తుతం మూసాపేట, కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ సర్కిళ్ళు ఉండగా, కొత్తగా కొంపల్లి, గుండ్ల పోచంపల్లి, మేడ్చల్, దుండిగల్, నిజాంపేట్, బొల్లారంలు చేరనున్నాయి. చార్మినార్ జోన్‌లో మలక్ పేట, సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్ నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ళు ఉండగా కొత్తగా బండ్లగూడ జాగీర్, శంషాబాద్, జల్‌పల్లి, తుక్కుగూడ సర్కిళ్ళు రానున్నాయి. శేరిలింగంపల్లి జోన్ లో యూసుఫ్ గూడ, శేరిలింగపల్లి, చందానగర్, పటాన్ చెరువు సర్కిళ్ళు ఉండగా, కొత్తగా అమీన్‌పూర్, తెల్లాపూర్, మణికొండ, నార్సింగి సర్కిళ్ళు రానున్నాయి. ఖైరతాబాద్ జోన్ పరిధిలో మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్ ఖరతాబాద్, జూబ్లిహిల్స్ సర్కిళ్ళు ఉండగా కొత్తగా మణికొండ సర్కిల్ ను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. అయితే ఇప్పటికే ఖైరతాబాద్ సర్కిల్ లో వీవీఐపీలు ఎక్కువ ఉన్న ప్రాంతంతో పాటు పరిధి కూడా అధికంగా ఉండటంతో మణికొండ సర్కిల్ ను శేరిలింగంపల్లిలో చేరిస్తే ఎలా ఉంటుందన్న అంశంపై అధికారులు చర్చిస్తున్నారు. జోన్ లు, సర్కిళ్ళ వారిగా ప్రాంతాలు, మ్యాప్ లను రూపొందిస్తున్న అధికారులు రెండు మూడు రోజులలో తుది రూపం ఇచ్చి పూర్తి స్థాయిలో గ్రేటర్ హైదరాబాద్ అథారిటీ (జీహెచ్ఏ)ను తీర్చిదిద్దనున్నారు. మ్యాప్ కు తుది రూపం ఇచ్చిన అనంతరం ఉన్నత స్థాయిలో సమీక్షించి మార్పులు, చేర్పుల అంశాలను పరిశీలించిన అనంతరం ప్రభుత్వ ఆమోదానికి పంపించాలని నిర్ణయించారు.

**బడ్జెట్ రూపకల్పనలోనూ బిజీ బిజీ**

విలీన మునిసిపాలిటీల తర్వాత నగర రూపు రేఖలు మార్పును సిద్ధం చేస్తూనే అధికారులు మరో వైపు ప్రస్తుతం ఉన్న జీహెచ్ఎంసీ 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందిస్తోంది. ఈ బడ్జెట్‌లో ఆస్తిపన్ను ఆదాయంపైనే ప్రధానంగా దృష్టి సారించారు. రెవెన్యూ విభాగం కొత్త ఆర్థిక సంవత్సరంలో ఆస్తిపన్ను ద్వారా రూ. 2,200 కోట్లు, ట్రేడ్ లైసెన్స్ రుసుము ద్వారా రూ. 115 కోట్లు, ప్రకటనల రుసుము ద్వారా రూ. 50 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, నగర ప్రణాళిక విభాగం నిర్మాణ అనుమతుల రుసుము ద్వారా రూ. 1,200 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పద్దు రూ. 8,440 కోట్లు ఉండగా.. రాబోయే ఆర్థిక సంవత్సరం పద్దు సుమారు రూ. 8,600 కోట్లు వరకు ఉంటుందని ఉన్నతాధికారులు అంచనా వేస్తున్నారు.

# సర్ గడువు పొడిగింపు

ఏడు రోజులు పొడిగించిన ఈసీ

**ఢిల్లీ, మహా:** ఓటరు జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) గడువును 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మరో ఏడు రోజులు పొడిగిస్తూ ఈసీ నిర్ణయం తీసుకొంది. ఓటర్లు తమ పేర్లను ఎలక్టోరల్ రోల్స్‌లో తనిఖీ చేసుకొనేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకొంది. ప్రస్తుతం ఎస్ఐఆర్ రెండో దశలో ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తర్‌ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, పుదుచ్చేరిలు ఉన్నాయి. కొత్తగా ప్రకటించిన మార్పుల ప్రకారం ఎన్యూమరేషన్ ప్రక్రియ గడవు డిసెంబర్ 4 నుంచి డిసెంబర్ 11వ తేదీకి మారింది. ఇక రేషనలైజేషన్, రీ ఆరేంజ్‌మెంట్ ఆఫ్ పోలింగ్‌స్టేషన్స్ గడువు డిసెంబర్ 11గా ఉంది. ఇక కంట్రోల్ టేబుల్ అప్‌డేషన్, డ్రాఫ్ట్ రోల్‌ను సిద్ధం చేసే ప్రక్రియ డిసెంబర్ 1215 వరకు జరగనుంది. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ పబ్లికేషన్ డిసెంబర్ 16వ తేదీన జరగనుంది. ఇక క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రకటనకు డిసెంబర్ 16 2026 జనవరి 15వ తేదీ వరకు సమయం ఇచ్చింది. ఇక నోటీస్ ఫేజ్‌ను డిసెంబర్ 16 నుంచి 2026 ఫిబ్రవరి 7గా నిర్ణయించింది.

మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 01-12-2025
సాహిత్యం LITERATURE 04

# చిన్నిల్లు


- డాక్టర్.దిలావర్,
98669 23294

నాకో చిన్నిల్లు ఉన్న సంగతి
నాకు తెలుసు,మీకు తెలుసు
లోకానికి తెలుసు
దాదాపుగా
ఆ చిన్న పూ పొదరింటిని
ప్రేమైక మందిరమని
ఆరాధిస్తారు ఎవరైనా
నిజంగా అతిలోక సౌందర్యవతి
నా ప్రేయసి
వెనుక;
వయ్యారంగ నాట్యమాడే
త్రాచులాంటి నల్లని
పూల జడతో
నాహృదయంలోకి
ఒక్కొక్క అడుగే వేసుకుంటూ
నడచివస్తుంటే
సత్యభామ కులుకు
దిగదుడుపే అనిపిస్తుంది
వాలుకనుల కంటి రెప్ప
ఒక్కసారి పైకి లేపిందంటే
నా నరనరాల్లో రక్తం కాదు
ఏదో విద్యుదాకర్షణ శక్తి
నాలో ప్రవహిస్తుంది
ఆమె కళ్ళలో
ఏదో అవ్యక్త సూదంటురాయి
ఉన్నట్టే ఉంది
ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ షహనాయీ
ప్రతిధ్వనిస్తూ ఉంటుంది
తేనెలు జాలువారుతూ
ఆమె మాట్లాడుతుంటే!
పండిట్ హరిప్రసాద్ చౌరాసియా
వేణునాదం అమృత ఝరులు కురిపిస్తూ ఉంటుంది
ఆమె కూనిరాగాలు తీస్తూ ఉంటే !
నా ముద్దరాలి కిలకిలా రావం చూసే
ఎస్.జానకి గారు అంత అందంగా నవ్వడం నేర్చుకున్నదేమో!
కేవలం పైకి కనిపించే అందమే కాదు
తెలియని కాంతివర్చస్సులు విరజిమ్ముతూ
భౌతికాతీతమైనది
ఆమె ఆత్మ సౌందర్యం!
ఆమె ఉత్త రసిక రాణి మాత్రమే కాదండోయ్
అనాధలు,అన్నార్తులు
అహో జగత్సహోదరులు కనిపిస్తే
అనంతమైన ప్రేమ వాత్సల్యాలతో
ఆమె మానవీయ హృదయానికి హత్తుకుంటుంది
అంతమాత్రం చేత
ఆమెది ఉత్త జాలి గుండే అనుకునేరు
ఎక్కడ అన్యాయం కనిపించినా
అశాంతితో రగిలి పోతుంది
ఆమె ధర్మాగ్ని హృదయం
ఎక్కడ అణచివేత,దౌర్జన్యం,జులుం కనిపించినా
క్రోధాగ్నులు పుక్కిలిస్తాయి
ఆమెలో జ్వాజ్వల్య మానంగా ఎగసిపడే
హోమాగ్ని గుండాలు

ఏది ఏమైనా
నాది అదృష్టమే
ఆమెను అలా ఆరాధిస్తుంటే
మా పెద్దింటి ఇల్లాలు
ఏమాత్రం అసూయ పడదు
పైపెచ్చు
నేను ఆమె సాంగత్యానికి ఉవ్విళ్ళూరినప్పుడల్లా
ఉద్దీపన పానీయలతో
నన్ను ఉసికొలుపుతుంది
ఇంతకూ మా చిన్నింటి ఆవిడ పేరు చెప్పనే లేదు కదూ
"క......వి.........త్వం..."

ఆహ్వానం
తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాహిత్య అకాడమి నిర్వహించు...
సాహిత్యవారం
(డిసెంబర్ మొదటి శనివారం)




కవి, రచయిత హనీఫ్ రచించిన
నువ్వు గింజవైతే
(కవిత్వం)
ఆవిష్కరణ సభ

తేది :
06.12.2025
(శనివారం)
సమయం:
సా॥ 5.00 గంటలకు
రవీంద్రభారతి
కాన్ఫరెన్స్ హాల్,
హైదరాబాద్.

సభాధ్యక్షులు : డా.ఎన్.బాలాచారి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి
ముఖ్య అతిథి&ఆవిష్కర్త : ప్రొ.జయధీర్ తిరుమలరావు
ఆధ్యకళ నిర్వాహకులు
విశిష్ట అతిథి : డా.సంగిశెట్టి శ్రీనివాస్
పరిశోధకులు, సాహితీవేత్త
పుస్తక పరిచయం : డా.రూప్‌కుమార్ డబ్బీకార్
ప్రముఖ కవి, రచయిత
సమన్వయం : ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్
9849082693

నిర్వహణ
తెలంగాణ సాహిత్య అకాడమి
అందరూ ఆహ్వానితులే...

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# దళిత రంగస్థలంపై తెలుగు నాటకం ఘనత

సాహిత్య ప్రక్రియలన్నింటిలో ఇటీవల అత్యంత అనాదరణకు, విస్మరణకు గురయ్యింది నాటకం. ఒకప్పుడు వెలుగులీనిన ఈ ప్రక్రియ ఇప్పుడు సినిమాల ధాటికి తాళలేక 'తెర'మరుగయ్యింది. తెలుగుతో సహా ఇది అన్ని భారతీయ భాషలకు వర్తిస్తుంది. అయితే గుడ్డిలో మెల్లలాగా తెలుగు 'రంగస్థలం'పై దళిత నాటకం కొంత విశ్వవ్యాప్తమైతున్న సందర్భమూ ఇక్కడే కనిపిస్తున్నది. ఈ నాటకాల్లో దళితులపై కుల వివక్ష, శ్రమ దోపిడీ, లైంగిక హింస అన్నీ వస్తువులయ్యాయి. ఈ దళిత నాటకాలు దళిత సాహిత్యానికే గాకుండా, దళితోద్యమాలకూ ఊపిరులూదాయి. భారతదేశంలో దళిత నాటక సాహిత్యం, 'రంగస్థలం' పాత్ర, నాటకాల్లో కళాకారుల పెర్ఫార్మెన్స్, దాని నిర్వహణ ఇట్లా అనేక అంశాలపై పరిశోధన చేసి వెలువరించిన ఆంగ్ల గ్రంథం 'ఈస్థటిక్స్ ఆఫ్ దళిత్ థియేటర్: పర్‌స్పెక్టివ్ ఆన్ కాస్ట్, క్లాస్ అండ్ జెండర్'. (Aesthetics of Dalit Theatre: Perspective on Caste, Class and Gender) దీన్ని పశ్చిమ బెంగాల్‌లోని విద్యాసాగర్ విశ్వవిద్యాలయానికి చెందిన ఇంగ్లీష్ ఆచార్యులు సుభేందుశేఖర్ నస్కర్ రాసిండ్రు. స్విట్జర్లాండ్‌కు చెందిన సుప్రసిద్ధ ప్రచురణ సంస్థ పాల్‌గ్రేవ్‌మాక్మిలన్ ఈ పుస్తకాన్ని ఇటీవల వెలువరించింది.

ఇందులో ఇంగ్లీషులోకి అనువాదమైన భారతీయ భాషల్లోని నాటకాలను పరిగణనలోకి తీసుకొని అధ్యయనం చేశాడు. ఇండియాలో వివిధ భాషల్లో వెలువడుతున్న నాటక సాహిత్యానికి ఇది ఒక రెఫరెన్స్ గ్రంథంగా కూడా ఉపయోగ పడుతుంది. మరాఠీ, బెంగాలీ, హిందీ, ఒడియా, మళయాలం, తమిళ, తెలుగు, కన్నడ, గుజరాతీ భాషల్లో వెలువడి, ఇంగ్లీషులోకి తర్జుమా అయిన నాటకాలను ఇందుకోసం నస్కర్ పరిశీలించారు. ఈ గ్రంథంలో దళిత నాటక కర్తలు దత్తా భగత్ (మరాఠీ), టెక్సాస్ గయక్వాడ్ (మరాఠీ, హిందీ), హర్షవర్ధన్ చౌధురి (బెంగాలి), రాజు దాస్ (బెంగాలి), కె.ఎ.గుణశేఖరన్ (తమిళం), అచింత్య బిశ్వాస్ (బెంగాలి), ఎం.జీవ (తమిళం), సముద్ర బిశ్వాస్ (బెంగాలి), దొలమని ఖందేర్ (ఒడియా), బి.కె.నాగ్ (ఒడియా), సామ్‌కుట్టి పటోంకర్ (మరాఠి), కోటిగనహళ్లి రామయ్య (కన్నడ), దు.సరస్వతి (కన్నడ) తదితరులు సృజించిన దళిత నాటక సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. వీరందరి నాటకాలను నస్కర్ మనకు ఈ గ్రంథం ద్వారా పరిచయం చేస్తున్నారు.

ఈ అధ్యయనంలో భాగంగా తెలుగులో నుంచి ఇంగ్లీషులోకి అనువాదమయిన నాటకాలను సైతం నస్కర్ పరిశీలించారు. వాటిలో బోయి భీమన్న 'పాలేరు', కొలకలూరి ఇనాక్ 'ముని వాహనుడు', ఎం.ఎం.వినోదిని 'దాహం' నాటకాలను విమర్శనాత్మక దృష్టితో విశ్లేషించారు.

తెలుగు దళిత నాటకాలకు అంతర్జాతీయ స్థాయిలో ఒక గౌరవం, గుర్తింపు ఈ పుస్తకం ద్వారా దక్కుతున్నది. కేవలం పుస్తకాలను చదివి, విశ్లేషించడమే గాకుండా ఆ యా నాటక కర్తలను ఇంటర్వ్యూ చేసి వారి అభిప్రాయాలను, అక్షరాల్లో రికార్డు కాని లోచూపుని నస్కర్ పాఠకులకు అందించారు. వేమన యూనివర్సిటీ ఆచార్యులు ఎం.ఎం.వినోదినిని గూడా ఆయన ఇంటర్వ్యూ చేసిండు.

తెలుగువారు గర్వించదగ్గ విషయమేమిటంటే మొత్తం భారతదేశ దళిత నాటక సాహిత్యంలో 'పాలేరు' నాటకమే ఆధునిక జీవితాన్ని ప్రతిఫలింపజేసిన వాటిలో మొదటిది అని ఈ పరిశోధన ద్వారా




అర్థమయితున్నది. నిజానికి స్వామి అచ్చుతానంద్ హరిహర్ (18791933) రాసిన (రామరాజ్య న్యాయ, 1926) శంభుక వధ తొలి దళిత నాటకంగా కొందరు భావిస్తారు. కానీ ఆ నాటకాంశం పౌరాణికమైనది కావడంతో దాన్ని ఆధునిక దళిత నాటకంగా పరిగణించలేము. నిజానికి మహాత్మా జ్యోతిబా పూలే రాసిన 'తృతీయ రత్న' (మూడో కన్ను) దళిత, బహుజన దృష్టికోణంతో రాసిన మొదటి నాటకం. ఈ నాటకం 1855లో రాసినప్పటికీ 1979 వరకు పుస్తక రూపంలోకి రాలేదు. ఈ విషయాన్ని కూడా ఇందులో రచయిత విశ్లేషించారు.

ఇక మళ్ళీ విషయానికి వస్తే.. పద్మశ్రీ బోయి భీమన్న 1936 ఆ ప్రాంతంలో రాసి ప్రదర్శించిన 'పాలేరు' నాటకమే భారతదేశంలో తొలి దళిత నాటకంగా గుర్తించాలి. ఇందులో దళిత జీవితమున్నది. భారతదేశంలో దళితుడు, దళిత స్పృహతో రాసిన తొలి నాటకంగా దీన్ని భావించాలి. ఆ తర్వాత భీమన్న కూలి రాజు (1942), కష్టజీవి తదితర నాటకాలను రాసిండు. ఈయన 'గుడిసెలు కాలిబోతున్నాయి' నాటకానికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు దక్కింది. ఇట్లా భారతదేశ దళిత నాటక సాహిత్యానికి దిశానిర్దేశం చేసిన భీమన్న గురించి తెలుగేతర పాఠకులకు ఈ పుస్తకం ద్వారా వివరంగా తెలియవస్తుంది.

కొలకలూరి ఇనాక్ రాసిన ఆరు ఏకాంకికలు 'అభ్యుదయం' పేరుతో అచ్చయింది. అట్లాగే 'మునివాహనుడు' నాటకం తమిళ, కన్నడ, మళయాల, హిందీ, ఇంగ్లీషు భాషల్లోకి అనువాదమయింది. దళితుల దేవాలయ ప్రవేశం పైన రాసిన ఈ నాటకం విమర్శకుల ప్రశంసలందుకున్నది. 2019లో విమర్శిని వ్యాస సంపుటికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు అందుకున్న ఈయన అంతకు ముందు 'కంచికచర్ల కోటేశు' మీద కూడా నాటకం రాసిండు.

కవి, కథకురాలు, విమర్శకురాలు కూడా అయిన ఎం.ఎం.వినోదిని 2002లో రాసిన దాహం నాటకాన్ని సునీతరాణి ఇంగ్లీషులోకి అనువదించారు. ఈ నాటకాన్ని నస్కర్ ఇందులో విశ్లేషించారు. ముఖ్యంగా అత్యాచారాలకు సంబంధించిన అంశాలను పరిశోధకులు హైలైట్ చేశారు.

ఇందులో బెంగాల్‌లో ప్రసిద్ధి గాంచిన జత్రపాల, మహారాష్ట్రలోని తమాషా, లావణి, పావడా, కర్నాటకలోని యక్షగానం తదితర నాటక ప్రక్రియలను రచయిత ఇందులో పేర్కొన్నాడు. అయితే తెలంగాణ, ఆంధ్రాలో ప్రసిద్ధిగాంచిన శారదకాండ్రు, పాండవులోళ్లు, యక్షగానాలు, చిందు భాగోతం, వీధి భాగోతం, ఇతర ప్రదర్శన కళల గురించి విస్తృతంగా పేర్కొనాల్సి ఉండిందే! అంతెందుకు తెలుగునాట దళితోద్యమానికి పునాదులు వేసిన భాగ్యరెడ్డి వర్మ 1906 నుంచి 1938 వరకు నాటకాలు, బుర్రకథలు, ఇతర ప్రచార కార్యక్రమాల ద్వారా చైతన్య కార్యక్రమాలు చేపట్టారు. ఆంధ్ర మహాసభ సమావేశాలు జరుగుతూ ఉంటే తన ప్రదర్శన బృందంతో కలిసి ఆయా ప్రదేశాల్లో మద్యపాన సేవనానికి వ్యతిరేకంగా, అస్పృశ్యతకు వ్యతిరేకంగా స్కిట్స్ వేసి ప్రచారం చేసేవారు. వీరు స్వయంగా ఒక నాటక బృందాన్ని నడిపారు. ఏలూరుకు చెందిన నక్కా వెంకయ్య బుర్రకథలు, స్టేజి నాటకాలు ప్రసిద్ధం. ఈ విషయం ఇంగ్లీషులో ఎవరైనా రాసి ఉంటే అది అందరికీ తెలిసేది. భవిష్యత్తులోనైనా ఈ విషయాలన్నీ చర్చకు పెట్టాలి.


డా. సంగిశెట్టి శ్రీనివాస్
98492 20321

'సత్యశోధక్ జల్సా', 'అంబేద్కర్ జల్సా'లు ఇండియన్ పీపుల్స్ థియేటర్‌లు సబాల్టర్న్ వర్గాల నాటకానికి చేసిన సేవల గురించి కూడా ఈ గ్రంథంలో నస్కర్ రికార్డు చేసిండు. అంతేగాదు అంబేద్కర్ స్ఫూర్తి, తోడ్పాటుతో ఎం.వి.చిట్నిస్ 1950ల్లో 'యుగయాత్ర' అనే నాటకాన్ని రాసిండు. 1955లో ఈ నాటకాన్ని తొలుత ఔరంగాబాద్‌లో ఆ తర్వాత అంబేద్కర్ సమక్షంలో నాగపూర్‌లో బుద్ధదీక్ష సందర్భంగా ప్రదర్శించారు. ఇట్లా అంబేద్కర్‌కు నాటకానికి ఉన్న సంబంధం కూడా ఇందులో చిత్రితమయింది. అయితే దళిత కళా మండలి పేరుతో మాస్టార్జీ చేసిన సేవలు, లెల్లె సురేశ్ బృందం ప్రదర్శనలు, గతంలో జననాట్య మండలి తరపున గద్దర్, తదితరులు వేసిన నాటకాలు, స్కిట్స్, ప్రదర్శనలు కూడా ఈ చరిత్రలో భాగం కావాలి.

ఏది ఏమైనా తెలుగు దళిత నాటకాల గురించి అంతర్జాతీయ స్థాయిలో చర్చ జరిగేందుకు ఒక వేదికను కల్పించినందుకు నస్కర్‌ని అభినందించాలి. ఇందులో మిగతా భారతీయ దళిత నాటకకర్తలతో పోటీ పడి తెలుగుకు ప్రాతినిధ్యం వహించిన బోయి భీమన్న, కొలకలూరి ఇనాక్, ఎం.ఎం.వినోదినిలు చరిత్ర సృష్టించారు. వీరేగాక తెలుగులో నాటకాలు రాసిన దళితులు చాలా మంది ఉన్నారు. వారికీ ఈ గౌరవం దక్కాలి. అప్పుడే తెలుగులో వచ్చిన దళిత నాటకం గురించి అందరికీ తెలుస్తుంది.

# అంతర్ముఖీన మహా సంకల్పయాత్ర

వేసవి కాలం, వర్షాకాలం , శీతాకాలం సర్వసాధారణంగా, క్రమానుగతంగా వచ్చేవి, ప్రాకృతిక ధర్మానుసారంగా. జనం అనుభవంలో వున్నవే. కొన్నిసార్లు ఈ త్రికాలాల ధర్మసూత్రం కుడిఎడమలయ్యే, ఆశని పాతాలయ్యే స్థితి ఒకటి పొంచి వుంటనే వుంటది. అదట్లా వుంచి, "తప్పిపోయిన కాలం" ఒకటుందని, గుర్తు చేస్తూ ఈ మూడు కాలాల ముందటికి, చేర్పు గా
కవి ధర్మంగా ప్రతిష్టింప చేస్తున్నారు మడిపల్లి రాజ్ కుమార్ గారు.
"జ్ఞాపకాల నీడలలో నన్నెపుడో చూస్తావు.
నను వలచావని తెలిసే లోగా నివురై పోతాను" అని ఆత్రేయ గారి పాట. మనిషీ, సమాజమూ, ప్రకృతీ ఏమి ,ఎంత కోల్పోయిందో ఈ తొలి పొత్తంలో జ్ఞాపకాలుగా నిలువరింప జేస్తయి. అడుగుల కింద నేల పొర చిద్రం, అడవి పచ్చందం వికృతం, బాల్యానందం గాజా నిలువుటద్దంలో భళ్ళున పగలటం, నిర్మల్ బొమ్మల కొలువు సినీ ఫ్లెక్స్ బొమ్మల ముందు మసకబారటం, ఆపిల్ రాణి ముందు సీతాఫలం గింజంత బేరమవటం, దాదాల తుడుం పామ్ ఆక్రోశం పాటలు గాల్లో గిరికీలు కొట్టటం, బతుకు చుట్టూతా భ్రమల మాయలాడి గారడి చేయటం లాంటి వెన్నో అలుముకున్న నీడలలో ఉన్నదేదో లేనిదేదో, పోయిందెంతో, పోగొట్టుకున్న దెంతో గమనింపు లేకుంటే పై పాట లోని రెండో చరణానికి దగ్గరవటం ఎంతో దూరముండబోదనుకోవచ్చు. ఎవరికి పట్టి లేని తనమే పుట్టి మునిగే నడిసంద్రానికి తోసుకొస్తున్నం. కవికి తట్టి లేపే పట్టి వున్నందునే తల్లి నేలలో తప్పిపోయిన కాలాన్ని కొత్త వెలుగు దిశగా నడిపించే మహాసంకల్ప దీక్ష పేజీల బుజాల మీద మోస్తుండటం చూస్తం.

వైయక్తికం, సామాజికం రెండూ వేర్వేరనుకుంటం. వైయక్తిక (ప్రైవసీ) భావన ఆధునికత లో కొట్టొచ్చినట్లు కన్పడుతున్నందున. సామాజికం లో వున్నప్పుడు వైయక్తికంగా వివేచించటం, వైయక్తికంగా మసలినప్పుడు సామాజిక చింతనగా ఆలోచించటం కవికి నిత్యకృత్యయాది. బాధ, బాధ్యత. అందుకే కృష్ణశాస్త్రి, శ్రీ శ్రీ ల ఉదాహరణ లున్నయి. స్వంతాన్ని సార్వజనీనంగా, సకలాన్ని స్వయానికి స్వీకరించటం ఈ కవిలోనూ ద్యోతక సుగుణమే. తప్పిపోయిన కాలం లోకి అంతర్ముఖీన యాత్ర చేస్తే మానసికాలు, ప్రకృతికాలు ప్రధానమైనప్పటికీ పల్లీయత, కళాత్మకత, శ్రమ సుందరం, గిరి గీసే నిబద్ధత, మార్కెట్ నిరసన, యాది స్మరణలు, మురిపెములు, హాసం హాస్యాలు, కృతజ్ఞతలు, పోరుతనం, శబ్దంగానిశ్శబ్దంగా ప్రతిధ్వనిస్తుంటయి. దృశ్య సమూహాలు కళ్ళ వెనక పోతూ వస్తూ తిరుగుతుంటయి. ఆశ్చర్యంగా కవి మాత్రం లీలగా అక్కడక్కడా సూత్రధారిగా కనిపించే విశేషంతో పాత్రధారుల పట్ల గాఢానుబంధం పెంచుకునే అవకాశం పఠిత లోకానికి దక్కుతుంటది. శిల్ప చాణక్యం కంటే విషయ స్పష్టత, సౌందర్య సృజనాత్మకత పట్ల కవి శ్రద్ధ కవితలకు బలమైన ఆయువుపట్టు. కవితని లక్ష్యాన్ని చేర్చేందుకు ముగింపు స్పేస్ ని సందర్భోచితంగా వుపయోగించుకోవటం పై ప్రత్యేక దృష్టి గా తోస్తుంది.




కొన్ని కవితలను వుటంకించదలిస్తే---
"గిర్ని పోరని చేత
గింజ పిండి వెన్నెలైతేనే కదా..
ఏ తల్లి వాత్సల్యమైనా
రొట్టె చంద్రుడై చీకటి కాల్చింది."
పిండిగిర్ని
"రక్త పింజరులు రాజుల మనసులో కరిగించి
వాళ్ళ ఆదరణలో వెలిగిన వాళ్ళు
ప్లాస్టిక్ పొరలు కమ్మిన గ్లోబల్ కళ్ళను
మెప్పించ లేకనే తిప్పలు పడుతున్నరు."
నిర్మల్ బొమ్మలు
"రాతిరే కన్ను తెరచి
పొద్దున్నే రాలే ఆ పూలకు
ఏ గాయాలు కాకూడదని
ఆమె గచ్చును శుభ్రం చేయడమే కాదు
నీళ్ళతోనూ ఊదుస్తూ కడిగి
చల్లటి నీటిపొరనే తుంగచాపగా
పరుస్తుంది" తెంపని పూలు
"తోలు సంచిలో ఎముకల గూడు
ఎముకల గూటిలో నిప్పుకణికల కాదు
కణికల కాటిపై వేగే జీవుడు"
మరణ యాతన

ఒక ఆర్ద్ర హృదిలో కలం ముంచితే తప్ప ఇట్లాంటి వెన్నాడే కవిత్వ పాదాలు పుట్టవు. పొద్దుపోకనో, అలవోకగనో, జనం మరచిపోతారోననో రాస్తే కుదరదు. కవిత్వ శక్తి కవి మనసు మీదనే శక్తి కుదుర్చుకుంటది. ఇక్కడ ఒక మాట చెప్పాలి. మృత్యువ్యూహం, మృత్యుగాలం, మరణ యాతన కవితలు వాస్తవ చిత్రణగా భయంకరమైన మరణాన్ని చవి చూపిస్తయి. ప్రకంపనలకు గురౌతం. ఈ మధ్య గుడిపాటి గారు రాసిన "వేళయింది" కవిత భీభత్స మరణాన్ని సునాయాసంగా, ప్రశాంతతగా మార్చివేసింది. అట్లాంటి ఆనందకర అనుభవానికి ఉవ్విళ్ళూరేటట్లుగా రోల్ మోడల్ అయింది.
కాళ్ళకింది నేల పుట్టినప్పటిదైన సంగతి మతిల మరువనందునే తెలంగాణ పాయిరమైంది. వచ్చిన నాటి సంబరాన్ని "భూమ్యాకాశాల బుక్కా గులాల్లో/ రంగుల రంగేలి చెమకేలి" గా జరుపుకొని తృప్తి పడక, ఒక్కొక్క పువ్వేసి నట్లు పదారు కళల తెలంగాణను కుదిరిచ్చుకోవాలె ననే అత్యాశపరుడీ కవి. పుష్కర కాలమైనా ఆ వగపు ఇంకా మిగిలే వుండటం పుస్తక ముఖచిత్రం రివైండ్, రిమైండ్ చేస్తున్నది. చేయి తిరిగిన కలం వైవిధ్యభరితాన్ని రుచి చూపిస్తది. గాజాబాలుడు అనువాదం, వాన పదాలు హైకు, క్యూ అంకెల వరుస, మహబూబ్ ఘాట్ తెలంగాణ నుడికారం, ఆదిలాబాదు యాస, సాంప్రదాయిక తొంగి చూపు, విప్లవ దృక్పథం పఠితానుభవంలో కవి ప్రాశస్త్యం వెల్లడౌతుంటది.

హాస్య ప్రియత్వం రిఫ్రెష్ నెస్ కు సంకేతం. కొన్ని కవితల్లో తెనాలి రామలింగని చతురత కూడా స్ఫుటకరిస్తది. దోమ రాత, మనిషి గెలుపు, అమ్మో..మనిషి, ఐస్ క్రీమ్ సూర్యుడు ఇట్లా.. ఓ రెండు కవితల విభిన్నత లేదా వైరుధ్యం సామాజిక కోణంలో చర్చించాల్సి, అర్థం చేసుకోవాల్సి వుంటుందేమో. కవి మాత్రం రెండు వివిధ సందర్భాల్లో రికార్డైన ఘటనలను 'వాళ్ళిద్దరూ', 'అనుమాన పర్వం' లో అక్షరీకరించటం ఒక సాహసంగానే చూడాలి. హిందూ ముస్లింల భయ్యా చిచ్చా ల దోస్తానా, అలయి బలయి ప్రశ్నార్థకం.., చదివాక ఆలోచనా పురుల నల్లుకుంటయి.

ఆఖరున, 'ఒక పొరపాటుకు యుగముల పొగిలేవు' మనసు కవి ఆత్రేయ దో పాటలో చరణం. ఈ కవికి నప్పుతుందది. "శప్తుణ్ణి" అని ప్రకటించుకున్నది చూస్తే. కొలను దగ్గర కూర్చుని గులకరాయి విసిరాడట. మునుగుతూ అదీ, కొలనుకు గాయమై అదీ, వెక్కి వెక్కి ఏడ్చే చంటాడిలా, సున్నాలు సున్నాలుగా తన్ను తిట్టినాయట. ఆ నిశ్శబ్ద దుఃఖ శాపం కొలనుకూ రాయికీ ప్రాణముందని, లేనిది తనకని ట.

ఇంతటి చివురు పొరల్లో అంతరంగం చుట్టబడి వున్నది కాబట్టి, వేకువ పొద్దు లా మేల్కొని వున్నడు కనుక, ప్రాణ స్పందనలకై వూపిర్లూదుతూ మృగ్యమయ్యే గహనాటవుల, మానవ సీమల తప్పిన తోవల కవితా పదాలు పరుస్తూ---అనుసరిస్తూ..!


- దాసరాజు రామారావు
96182 24503

## ఉనికి

ఎవరో పిలిచినట్లు అనిపించి
ఉలిక్కిపడి లేచి తలుపులు తెరచినప్పుడు
గలగలమంటూ ఎండిన మామిడాకులు తలూపాయి.
పిలిచిన విషయం విసిరేసి
గీసి గీసి బేరమాడి తెచ్చి కట్టి వారం కూడా కాని
ఆకులపై నా దృష్టి మరలి ప్రాణం ఉసూరుమంది.

అడుగుకొక కేక వినిపిస్తున్న వరసలన్నీ దాటుకుంటూ
అద్భుతమేదో తలలో మెరిసినట్టు వెతికి వెతికి
సగం కుళ్ళిన పూలబంతుల్లో మేలిమివి ఏరుకుని
నా అతితెలివికి నాకునేనే సెహభాష్ అని మెచ్చుకున్నా..
తెచ్చిన పూలు ఒక్కరోజుకే తలలు వాల్చి నేలరాలుతున్నప్పుడు
పక్కింటి గుమ్మంవైపుకు ప్రయాణించకుండా ఊడుస్తుంటే
కలుక్కుమంటున్న నా నడుము సహాయాన్ని కోరుకుంది.

తెలియని పనుల వత్తిడిలో
ఇమడని రహస్యాలే ఇవన్నీ...
నవ్వలేక, ఏడ్వలేక, ఎవరికీ చెప్పుకోలేక
జరిగే ప్రతి తంతూ నా ఉనికి ఉద్ధరణలే..

ఏదో దాచేద్దామనుకునే నా లాంటివారు
మరిన్ని పోగొట్టుకుంటూనే వున్నా
తెల్లారిపోతున్న తెలివిని ప్రదర్శిస్తూనే వుండాలి మరి!

- శైలజామిత్ర, 92909 00879

## ఏకవచనం

సందడిలో
ఆటపాటల కరచాలనం
సమూహంలో
కేరింతల స్వర ఝరుల గానం

బహుదూరపు బాటసారుల
దరువువేసే కాలి అందెలు
పరువాల మధురిమల మనోహర పరిమళ బృంద
షహనాయి పాట

ఒకచోట దగ్గరితనం వికాస నివాసం
మరొక చోట గౌరవ కాంతిరేఖ విరచిత కావ్య విజ్ఞానం
ఇంకొక చోట విజయగర్వ తొణికిస అలాయ్ బలాయ్

కలిపిన చేతులను మించిన మహోదయ వాక్య తొలి పద్య పదం
సంభాషించే మనసు మనసునజ
హృదయ నవగీతం

ఏకాంతానికి సన్నద్ధపరిచే ఏకోన్ముఖ వచనం
నిటారు శిరశ్శిఖరం బహుళగా జూలు దువ్వే పెద్దరికం
సుందర మంజూష సుమ బాణం బహువచన నడకల ఒకే బాట

ఒకరు ఒకరితో కుడుపు నిండా
మమతల కుండ ఒలుకబోయడం
వొత్తిలా సమూహంలో
ఒంటరికాని ఏక కిరణం
హృదయం హత్తుకునే ఆత్మీయ నేపథ్యతీగ ఏకవచనం

ఏక పదబంధంలో చుట్టేసి
ప్రపంచాన్ని
తనలో దాచుకోవడం
గుండె గొంతుకలోన కొట్లాడే బహువచనం
నాలో ప్రవహించే ఏకవచనం

- డా.టి.రాధాకృష్ణమాచార్యులు, 98493 05871

## బెల్లంపల్లిలో రోడ్డు వెడల్పు బాధితులకు న్యాయం చేయాలి

బెల్లంపల్లి రోడ్డు వెడల్పు బాధితుల పోరాట కమిటీ కన్వీనర్ చల్లూరి దేవదాస్



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులతో నష్టపోయిన బాధితులకు వెంటనే న్యాయం చేయాలని రోడ్డు వెడల్పు బాధితుల పోరాట కమిటీకన్వీనర్ చల్లూరి దేవదాస్ డిమాండ్ చేశారు. ఆదివారం రోజు ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ డిసెంబర్ 2వ తేదీన రోడ్డు విస్తరణ పనులతో దుకాణాలను కోల్పోయిన వ్యాపారులతో సబ్ కలెక్టర్ కార్యాలయంను ముట్టడిస్తామని వెల్లడించారు. రోడ్డు విస్తరణ పనులు కోల్పోయిన దుకాణాల యజమానులతో కలిసి ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణంలో రోడ్ల వెడల్పు పేరుతో ప్రభుత్వం అధికారులు విధ్వంసానికి పాల్పడుతూ బెల్లంపల్లి పట్టణ ఉనికినే లేకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నారనీ,నెల రోజుల క్రితమే అనేక షాపులను,చిరు దుకాణాలను కూల్చి వేసి వందలాది మందిని రోడ్డుపాలు చేయడం జరిగిందనీ, నేటికీ బాధితులను ఆదుకునే చర్యలు చేపట్టలేదని,మరోపక్క ఇతర ప్రాంతాల్లో షాపులను ఇళ్ళను కూల్చివేయడం కోసం ప్రయ త్నాలు చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా రోడ్డు విస్తరణ బాధితులందరూ సబ్ కలెక్టర్ కార్యాలయమును ముట్టడించే కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రోడ్డు బాధితుల పోరాట కమిటీ సభ్యులు ఎండి గౌస్ బాయ్, బొడ్డు శకుంతల, షేక్ ఖాజా బాబా, సులేమాన్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

## అశ్రునయనాల మధ్య ఆర్ఎస్ఎస్ నేత రేవా కోటేశ్వరరావు అంత్యక్రియలు

పెద్ద ఎత్తున తరలివచ్చిన ఆర్ఎస్ఎస్, బిజెపి నేతలు, ప్రముఖులు



**వరంగల్ మహా;** వయోభారంతో శనివారం మధ్యాహ్నం వరంగల్ డాక్టర్స్ కాలనీలో కన్నుమూసిన ఆర్ఎస్ఎస్ నేత రేవా కోటేశ్వరరావు (92) వరంగల్ సికేఎం కళాశాల సమీపంలోని హిందూ స్మశాన వాటికలో ఆదివారం మధ్యాహ్నం స్వయం సేవకులు, బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు జరిగాయి. స్వయం సేవకులు, బంధుమిత్రుల అంతిమదర్శనార్థం ఆయన భౌతిక దేహాన్ని డాక్టర్స్ కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. రాష్ట్రం నలుమూలల నుండి ఆయన అంత్యక్రియలలో పాల్గొనడానికి ఆర్ఎస్ఎస్, బిజెపి నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో డాక్టర్స్ కాలనీ పరిధి మొత్తం జనసంద్రంగా మారింది. ఆర్ఎస్ఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బర్ల సుందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కాచం రమేష్, ప్రాంత ప్రచారక్ లింగం శ్రీధర్, వనవాసి కళ్యాణ పరిషత్ అఖిలభారత కార్యకారిణి సభ్యులు కొరిగింజ రామచంద్రయ్య, భారతీయ కిసాన్ సంగ్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి దోనూరి రాము, సేవా భారతి ఎక్కా చంద్రశేఖర్, జాగృతి వారపత్రిక సహసంపాదకులు దుర్గారెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంత వ్యవస్థా ప్రముఖ్ గంటా తిరుమల్, క్షేత్ర ప్రచారక్ ప్రముఖ్ గొట్టిముక్కల భాస్కర్, ఆర్ఎస్ఎస్ రాష్ట్ర కార్యకారిణి సభ్యులు టి ఎస్ ఆర్. మూర్తి, నవయుగ భారతి ప్రాంత సహ సంయోజకులు రాంపల్లి మల్లికార్జున్, ప్రాంత సేవా ప్రముఖ్ గాజుల శివశంకర్, సంస్కృతి ఫౌండేషన్ సంయోజక్ కొంపర్ల రామ్మూర్తి, ప్రాంత శారీరక్ ప్రముఖ్ బాధరేని మధు, ఆర్ఎస్ఎస్ వరంగల్ విభాగ సంఘ చాలక్ ప్రొఫెసర్ చిలకమారి సంజీవ, విభాగ కార్యవాహ ప్రొఫెసర్ గద్దె రమేష్, వరంగల్ మహానగర్ ఆర్ఎస్ఎస్ సంఘ చాలక్ డాక్టర్ బందెల మోహన్ రావు, బిజెపి నాయకులు ఎం .ధర్మారావు, టి. రాజేశ్వరరావు, వన్నాల శ్రీరాములు, సీతారాం నాయక్, రాష్ట్ర సేవికా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అరుణ, శ్రీ సరస్వతీ విద్యాపీఠం పాక రాజమౌళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్ తో పాటు పలువురు ప్రముఖులు మహా నేత రేవా కోటేశ్వరరావు భౌతిక కాయాన్ని దర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## ఆరోగ్యాన్ని కాపుడుకోండి

కాంగ్రెస్ సీనియర్ నేత చిప్ప వెంకటేశ్వర్లు




**వరంగల్ మహా;** వరంగల్ 23 వ డివిజన్ కొత్తవాడలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ 80 ఫీట్ల రోడ్ నందు డాక్టర్ అంబటి విజయ్ కుమార్, ఎముకలు, కీళ్ళు వెన్నుముక, డాక్టర్ నమ్రత నరములు మానసిక వైద్య నిపుణులు వరంగల్ వారిచే ఏర్పాటు చేసిన ఉచిత ఆర్థో వైద్య ఆరోగ్య శిబిరాన్ని టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తవాడ పరిసర ప్రాంత ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి ఈ ఉచిత మెగా వైద్య ఆరోగ్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. సుమారు 400 మంది ఎముకల దృఢత్వ (బి ఎం డి ) పరీక్షలు చేయించుకుని క్యాల్షియం హెచ్చు తగ్గుదలకు సలహాలు సూచనలు తీసుకున్నారు. అనంతరం వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ ఉచిత ఆరోగ్యశిబిరాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ల బృందానికి చిప్పవెంకటేశ్వర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యెలుగం చిన్న కొమురయ్య, మంత్రి లింగమూర్తి, గజ్జెల ఓంకార్, బొల్లు సతీష్, సజ్జన్ నాయక్, కోడూరి నరేష్ మోక్ష, దానం రాజయ్య డా. అజయ్ కుమార్ అంబటి, నమ్రత దేవులపల్లి, రఘుపతి,మద్దె ఉమేష్, రాహుల్, మాధురి, అక్షయ, శిరీష హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపియూఎస్ఐ పార్టీ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి సభ

ఆపరేషన్ కగార్ పేరుతో విప్లవ కారులను చంపడం హేయమైన చర్య




**వరంగల్ మహా;** వరంగల్ పట్టణం లోని రైతు భవనంలో సిపియూఎస్ ఐ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 135వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సభకు సిపియుఎస్ఐ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ గద్దం శరత్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా సి పి యు ఎస్ ఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న, గుడిపల్లి రవి దళిత బహుజన రాజ్యాధికార సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా గుడిపల్లి రవి మాట్లాడుతూ 300 జనాభా ఉన్నటువంటి ప్రతి వాడను ప్రత్యేక గ్రామపంచాయతీ గా, అదేవిధంగా 50 వేల నుండి లక్ష జనాభా ఉన్నటువంటి ప్రతి కులాన్ని ఒక ఎమ్మెల్యే నియోజకవర్గంగా అదే విధంగా ఒక లక్ష జనాభా ఉన్నటువంటి ప్రతి కులాన్ని ఎంపీ నియోజకవర్గంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఒక దేశాన్ని ఇంకొక దేశం పాలించే హక్కు లేనప్పుడు, ఒక ప్రాంతం ఇంకొక ప్రాంతాన్ని ఏలే హక్కు లేనప్పుడు , ఒక కులం ఇంకొక కులాన్ని ఏలే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. కులాల మధ్య పొత్తు లేనప్పుడు ఎన్నికల పొత్తు ఎందుకు ఉండాలని ప్రశ్నించారు. రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న మాట్లాడుతూ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ మహాత్మ జ్యోతి రావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ దేశంలో ఉన్నటువంటి కులాలకు రాజ్యాధికారం కావాలంటే కేవలం మారోజు వీరన్న సిద్ధాంత వెలుగులోనే సబ్బండ కులాలకు రాజ్యాధికారం దొరుకుతుందని కులాలు ఐక్యమై మా వాడలో మా రాజ్యం కోసం పిలుపునిస్తూ దేశంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు కేవలం ఒంటరి వర్గ పోరాటం ద్వారా ఏమి సాధించలేకపోయాయి. రష్యాలో విప్లవం వచ్చింది చైనాలో విప్లవం వచ్చింది దాన్నే మళ్ళీ ఇక్కడ మక్కికి మక్కి అనుసరించడం జరిగింది. కాబట్టే ఈ దేశంలో ఉన్న కమ్యూనిస్టు పార్టీ పుట్టి 100 సంవత్సరాలు పూర్తి అయ్యిందని గొప్పగా చెప్పుకుంటున్నాం కానీ ఈ దేశంలో ఉన్నటువంటి వాస్తవాలను పరిశీలించకుండా అధ్యయనం చేయకుండా కేవలం అక్కడిదే ఇక్కడ చేయాలని చెప్పడం జరిగిందని తెలిపారు. ఈ దేశంలో ఏ ఒక్క కమ్యూనిస్టు పార్టీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చెయ్యలేని మనం ఇప్పటికైనా కుల వర్గ పోరాటాల సిద్ధాంతాన్ని వెలుగులోకి తీసుకువచ్చి వాడలో మా రాజ్యం ద్వారానే సప్పండ కులాలకు రాజ్యాధికారం దక్కుతుందని అది సాధించినప్పుడే పూలే అంబేద్కర్ మారోజు వీరన్న ఆశయాలను ముందుకు తీసుకు పోగలుగుతామని ఆ పోరాటంలో అణగారిన కూలాలన్నీ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేసారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో వందలాది మంది విప్లవ కారులను పొట్టన పెట్టుకుంటూ ఆ ప్రాంతంలో ఉన్నటువంటి ఖనిజ సంపదలను కొల్లగొట్టి అంబానీ, ఆదానీ లకు దోచి పెట్టేందుకు గాను వారితో కుమ్మక్కై 2026 మార్చి 31 వరకు డెడ్లైన్ పెట్టుకొని ఇవాళ ప్రజల కోసం పోరాడుతున్న ఆ విప్లవ కారులను పిట్టలను కాల్చి నట్టుగా కాల్చి చంపుతున్నారు. ఇవాళ హిడ్మా లాంటి ఓ గొప్ప విప్లవకారుడు ఆదివాసీలకు అండగా ఉన్నందుకు కేంద్ర ప్రభుత్వం బూటకపు ఎన్ కౌంటర్లో కాల్చి చంపింది. ఇవాళ అర్బన్ నక్సలైట్ల పేరుతో ప్రశ్నించే వాళ్లను కూడా జైల్లో పెట్టి నిర్బంధిస్తూ అగ్రకుల మనువాద బ్రాహ్మణ పార్టీ అయిన బిజెపి వాళ్ల మేనిఫెస్టో లను పరోక్షంగా అమలు చేస్తూ ఇవాళ అణగారిన కులాల మీద అణిచివేత ధోరణి నీ అవలంబిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకమై పోరాడకపోతే ఇవాళ మనల్ని కూడా అర్బన్ నక్సలైట్ల పేరుతో ఎన్కౌంటర్ చేసే ప్రమాదం పొంచి ఉన్నదని పూలే, అంబేద్కర్ మారోజు వీరన్న కలలు కన్న మా వాడలో మా రాజ్యం కొరకై దళిత బహుజన జనత ప్రజాస్వామ్య విప్లవం లక్ష్యం కొరకై నిరంతరం సిపియుఎస్ఐ పార్టీ పోరాటం చేస్తుందని విజ్ఞప్తి చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో సిపియుఎస్ ఐ పార్టీ ములుగు, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి వావిలాల లక్ష్మణ్ సిపియుఎస్ఏ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్టపల్లి లింగయ్య తెలంగాణ ఉద్యమకారుడు సోమ రామమూర్తి తోపాటు మట్టపల్లి యాదయ్య శనిగర బిక్షపతి కేదర ప్రసాద్, కవి గాయకులు బికే మాజీ పి డి ఎస్ యు పూర్వ ఉద్యమ నాయకులు రాజేందర్ మహేందర్ భవిష్యట్టి వెంకన్న ముదిరాజు కళా మండలి రాష్ట్ర అధ్యక్షులు బుల్లెట్ వెంకన్న అరుణోదయ జిల్లా కన్వీనర్ నేటి లలిత ఆడజన సమాఖ్య మాజీ రాష్ట్ర నాయకురాలు కల్లేపల్లి ఇందిరా సిపియుఎస్ఐ పార్టీ వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు గద్దం వెంకట్ ఆడజన సమాఖ్య వరంగల్ జిల్లా నాయకురాలు గద్దం సరిత అక్క గద్దం స్వప్న బీడీఎస్ఎఫ్ వరంగల్ జిల్లా నాయకురాలు గద్దం వెన్నెల వివిధ ప్రజా సంఘాల నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# పంచాయతీ ఎన్నికల్లో కిక్కే కిక్కు!

## నేటి నుంచి కొత్త వైన్ షాపులు ప్రారంభం

- వైన్స్ షాపులు ఆరంభంలోనే ఓనర్ల కు భారీ ఆదాయం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 294 వైన్స్ షాపులు
- పల్లెల్లో మొదలైన పంచాయతీ ఎన్నికల సందడి




**వరంగల్ హన్మకొండ మహా;** తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల వేడి ఇప్పటికే మొదలైంది. కొన్ని గ్రామాల్లో పంచాయతీ అభ్యర్థి ఏకగ్రీవానికి మొగ్గు చూపుతున్నారు. కాగా ఆయా పట్టణాల నుండి వారి వారి స్వగ్రామాలకు ప్రయాణాలు చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. శనివారంతో మొదటి విడత ఎన్నికలకు నామినేషన్ల పర్వం పూర్తయింది. ఇక అభ్యర్థులు ప్రచార రంగంలోకి దిగడమే తరువాయి. అలాగే రెండు, మూడో విడతల ఎన్నికల ప్రక్రియ కూడా మొదలుకానుంది. అభ్యర్థుల నామినేషన్లు, ప్రచారం, అలకలు, బుజ్జగింపులు.. కూడా జరుగుతుంటాయి. ఇలాంటి సందర్భంలో రాష్ట్రంలో డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. లైసెన్స్లు దక్కించుకున్న వారు మద్యం షాపులు ప్రారంభించనున్నారు. షాపు తెరవగానే పంచాయతీ ఎన్నికల వేడి తగలడం ఈ తంతు సుమారు 18 రోజుల పాటు సాగుతుందని గ్రామ గ్రామాన మద్యం అమ్మకాలు జోరుగా సాగుతాయని వారు భావిస్తున్నారు.

**ఇక స్వస్థలాలకు గ్రామస్తులు**

పట్టణాలు, నగరాలకు ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్లిన వారంతా ఓటు వేసేందుకు స్వస్థలాలకు వచ్చేందుకు సలహాలు సన్నాహాలు చేస్తున్నారు. చుట్టాలు పక్కాలు అంటూ గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొంటుంది. పల్లె వాతావరణం కాస్త పండుగలా కనిపిస్తుంది. మామూలుగా పల్లె వాసులు ముచ్చటకైనా మద్యం కొనుగోలు చేసి సన్నిహితులు, బంధువులతో కలిసి మద్యం తాగడం పరిపాటి. ఇవన్నీ మద్యం షాపుల యజమానులకు కలిసి వచ్చే అంశాలు. అదీగాక ఎన్నికలవేళ ఎవరు కాదన్నా.. అవునన్నా.. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రలోభాలు ఉంటాయని, మద్యం ఏరులై పారుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. ఎన్నికల్లో గెలిచేందుకు పోటీ చేసే అభ్యర్థులు ఎంత కష్టపడైనా, ఎంత ముట్ట జెప్పి అయినా ఎన్నికల్లో గెలవాలని ఆరాటపడుతుంటారు. ఒక్కో అభ్యర్థి భారీగా మద్యం కొనుగోలు చేసే పరిస్థితి అనివార్య మవుతుంది. ఈ నేపథ్యంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.

**జిల్లాల వారీగా మద్యం షాపులు**

వరంగల్ రూరల్ జిల్లాలో 57, హనుమకొండ అర్బన్ పరిధిలో 67, జనగామ జిల్లాలో 50, మహబూబాబాద్ జిల్లాలో 61, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు కలిపి 59 మద్యం షాపులున్నాయి. ఇలా డిసెంబర్ 1 నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 294 మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. ఎక్సైజ్ శాఖ ములుగు, భూపాలపల్లి జిల్లాలకు సంబంధించి ఉమ్మడి కోటా ప్రకటించింది. డిసెంబర్ నెలలో మూడు విడతలుగా జిల్లాలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల కోలాహలం గ్రామాల్లో సుమారు 20 రోజుల పాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ అనుచర గణాన్ని, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు భారీగా ఖర్చు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా వైన్ షాపుల వద్ద జాతరను తలపించేలా విక్రయాలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

**దసరాను మించిన అమ్మకాలు ఉండే అవకాశం**

ఎన్నికల సందర్భంగా మద్యం కొనుగోళ్ల జోరు దసరా పండుగను కూడా మించి పోతుందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు ముగిసే నాటికి ఈ ఆదాయం రెట్టింపు అయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అంచనా వేస్తుంది. షాపులు ప్రారంభమైన తొలి నెలలోనే యజమానులు అత్యధిక లాభాలు ఆర్జించడం ఖాయ మేనని ఒకవైపు ఎన్నికలు, మరోవైపు డిసెంబర్ 31 వేడుకలు, అవి వెళ్లిపోగానే సంక్రాంతి పండుగ రానుంది. దీంతో కొత్త వైన్ షాపు యజమానులకు కాసుల పంట పండినట్లే అని విశ్లేషకులు భావిస్తున్నారు.




## హుస్నాబాద్‌ను తెలంగాణ కోనసీమగా చేస్తాం

రింగురోడ్డు, కబడ్డీ అకాడమీ, స్టేడియం, పార్కులు

మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు

**హుస్నాబాద్, మహా:** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా, ఉత్తర తెలంగాణ కోనసీమగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. డిసెంబర్ 3న హుస్నాబాద్‌లో జరిగే బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో సభా స్థలిని పరిశీలించిన మంత్రి పొన్నం.. ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. హుస్నాబాద్‌లో పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేస్తారని తెలిపారు. 'సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా.. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు బస్సులు ఇస్తాం. విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నాం. హైదరాబాద్ నుంచి హుస్నాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రారంభిస్తాం. హుస్నాబాద్‌లో రింగురోడ్డు, కబడ్డీ అకాడమీ, తాగునీటి సౌకర్యం, స్టేడియం అభివృద్ధి, డిగ్రీ కాలేజీ సమీపంలోని స్థలంలో పార్క్, మార్కెట్‌యార్డ్, కాటన్ మార్కెట్ అభివృద్ధి చేయాలని ఈ సందర్భంగా సీఎంను కోరనున్నాం. ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ బహిరంగ సభను విజయవంతం చేయాలి''అని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు.

## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు



**వలిగొండ, మహా :** రెండో విడత పంచాయతీ ఎన్నికల భాగంగా వలిగొండ మండలంలో వివిధ నామినేషన్ కేంద్రాలను ఆదివారం జిల్లా కలెక్టర్ హనుమంతరావు పరిశీలించారు నామినేషన్ కేంద్రాల వద్ద జనం గుమ్మి కూడకుండా చూడాలని అధికారులను ఆదేశించారు నామినేషన్ వేసే టప్పుడు బలపరిచిన అభ్యర్థులను మాత్రమే పంపించాలి అన్నారు

## మత్తు వదలండి.. క్రీడల్లో రాణించండి

- క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహపడతాయి
- బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ మహా;** హన్మకొండ భీమారం ప్రాంతంలో హన్మకొండ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు హాజరై టోర్నమెంట్ ను ప్రారంభించి సరదాగా క్రీడాకారులతో కలిసిబ్యాడ్మింటన్ ఆడుతూ, వారి ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు. అనంతరం బ్యాకింగ్ కోచ్ శీలం నరేందర్ ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని, క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాకారులు గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, నేటి ఓటమి రేపటి గెలుపుకు నాంది అని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక ఫోకస్ పెట్టిందని, తెలంగాణ రాష్ట్రంలోనే నాలుగవ స్పోర్ట్స్ స్కూల్ హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రారంభించామని, పర్వతగిరి మండలం కల్లెడకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవాంజీకి ప్రభుత్వం కోటి రూపాయలు ఇచ్చి ప్రోత్సహించిందని చెప్పారు. నేను కూడా స్పోర్ట్స్ మెన్ అని, వర్ధన్నపేట నియోజకవర్గంలో క్రీడారంగ బలోపేతానికి ప్రత్యేక కృషి చేస్తున్నానని చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తును వదిలి మైదానాలకు చేరుకోవాలని, క్రీడాకారులకు ఒక స్పోర్ట్స్ మెన్ గా అనునిత్యం అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే, హసన్పర్తి ప్రాంతంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయడానికి తాను కృషి చేస్తున్నానని త్వరలోనే స్టేడియం ఏర్పాటు అవుతుందని ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆర్గనైజర్, కాంగ్రెస్ నాయకులు, కనపర్తి కిరణ్, వీసం సురేందర్ రెడ్డి, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై మహా ధర్నా

టీయుడబ్ల్యూజె (ఐజెయు) ఆద్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ




**హన్మకొండ మహా;** జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయుడబ్ల్యూజే (ఐజెయు) ఆధ్వర్యంలో హైదరాబాద్ లో డిసెంబర్ 3న మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీయుడబ్ల్యూజె (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజేహనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్ లో నిర్వహించనున్న మహా ధర్నా కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి,తోట సుధాకర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం తాత్సార దోరణి అవలంబిస్తూ కాలయాపన చేస్తున్నదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నదని, ఈ క్రమంలో ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు వడిసెంబర్ 3న హైదారాబాద్ మాసాబ్ ట్యాంక్ రాష్ట్రసమాచార కమీషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు .ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజె (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్ మోహన్, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్, సీనియర్ నాయకులు సిహెచ్ సోమనర్సయ్య, ఎం. రాజేంద్రప్రసాద్, అనుముల రవి, దేవేందర్, ఎండి ఉస్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**హన్మకొండ మహా;** గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం (01/12/2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు ఎన్నికల నిర్వహణలో ఉన్నందున ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసిన విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఎన్నికల నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలి

రెండవ విడత నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన కమిషనర్, జిల్లా కలెక్టర్

**వరంగల్ మహా;** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ సజావుగా నిర్వహించుటకు ఎన్నికల అధికారులు ఎన్నికల నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు, రాష్ట్ర వెనుకబడిన వర్గాల సంక్షేమ కమిషనర్ బి. బాల మాయాదేవి ఐఏఎస్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. ఆదివారం రెండవ విడత నామినేషన్ల ప్రక్రియను పరిశీలించడానికి సాధారణ పరిశీలకులు సంబంధిత మండలాలను సందర్శించారు. ఈ సందర్భంగా సంగెం, గీసుకొండ, నల్లబెల్లి, దుగ్గొండి మండలాల్లో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో స్క్రూటినీ ప్రక్రియను పరిశీలించారు.స్క్రూటినిలో ఎన్నికల నామినేషన్ల రికార్డుల సంరక్షణ, అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలన, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియ,ఎన్నికల నియమ నిబంధనలను తూచ పాటిస్తూ పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు. తదనంతరం రెండవ విడత నామినేషన్ల స్వీకరణ జరుగుతున్న మండలాలు సంగెం, గీసుకొండ, నల్లబెల్లి దుగ్గొండి మండలాల్లోని నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ల దరఖాస్తుల స్వీకరణ, నిబంధనల మేరకు ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో లోపాలు చోటుచేసుకోకుండా, ప్రతి దశను నిష్పక్షపాతంగా, ఎన్నికల నిబంధనల మేరకు సిబ్బంది తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన పక్షంలో వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరిశీలనలో జీఎం ఇండస్ట్రియల్ అధికారి నరసింహామూర్తి , సంబంధిత మండలాల తాహసిల్దార్లు, అధికారులు ఉన్నారు.




## వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ అర్థ వార్షిక సర్వసభ్య సమావేశం

బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ మహా;** వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ లి.. ఆదివారం ఏర్పాటుచేసిన వరంగల్ వారి అర్థ వార్షిక సర్వసభ్య సమావేశం ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్ రావు చైర్మన్ అధ్యక్షతన వరంగల్ లోని అండర్ బ్రిడ్జి రోడ్డు ముందడ భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ వాటా దారులందరిని ఆహ్వానిస్తూ బ్యాంకు యొక్క అభివృద్ధిని గురించి క్లుప్తంగా తెలియపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం బ్యాంకు 414 కోట్ల వ్యాపారంతో దిగ్విజయంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తుందని బ్యాంకు యొక్క వ్యాపార విస్తీర్ణాన్ని పెంచుతూ సభ్యులు రిజిస్టర్ బై నెంబర్ 2 సవరించుటకు తాము ఏకగ్రీవంగా ఆమోదం తెలుపుతున్నామని తెలియజేశారు. ఈ సర్వసభ్య సమావేశంలో బ్యాంకు పాలవకవర్గ సభ్యులు వైస్ చైర్మన్ తోట జగన్నాథం, డైరెక్టర్లు చకిలం ఉపేందర్, మంద స్వప్న శ్రీనివాస్, బానోతు సీతా మహాలక్ష్మి శంకర్ నాయక్, ఏవి సత్యమోహన్, వద్నాల సదానందం, నీలం మల్లేశం, మహమ్మద్ సర్వర్ పాషా, పత్తి కృష్ణ, పొన్న హరినాథ్ డైరెక్టర్లు హాజరై తమ అమూల్యమైన సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ ఆఫీసర్ అన్నమనేని జగన్ మోహన్ రావు, బ్యాంకు సీఈఓ సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

## బల్దియాలో నేటి ప్రజావాణి రద్దు

బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయి

**వరంగల్ మహా;** బల్దియా ప్రధాన కార్యాలయంలో సర్వ సభ్య సమావేశం సోమవారం నిర్వహిస్తున్న దృష్ట్యా డిసెంబర్ 1వ తేదీన (సోమవారం) జిడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిడబ్ల్యూఎంసీ కమిషనర్ కమిషనర్ చాహత్ బాజ్ పాయి నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి గ్రేటర్ వరంగల్ నగర ప్రజలు ఫిర్యాదులు ఇచ్చుటకు బల్దియా కార్యాలయానికి రాకూడదని కమిషనర్ కోరారు.

# నామినేషన్ కేంద్రాలను సందర్శించిన డీసీపీ

**కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత**



**ఆమనగల్లు, మహా :** పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం మండలంలో ప్రారంభమైన నామినేషన్ల పర్వం ప్రారంభమైంది. సీఐ జానకి రామ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటేష్ నేతృత్వంలో పోలీసులు అన్ని నామినేషన్ కేంద్రాల వద్ద ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎం ఆర్ సీ భవనంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల దాఖలు కేంద్రాన్ని శంషాబాద్ డీసీపీ రాజేష్,షాద్ నగర్ ఏసీపీ లక్ష్మినారాయణ తో కలిసి సందర్శించారు. స్థానికంగా ఉన్న పరిస్థితులు, బందోబస్తు ఏర్పాట్లు, పోలింగ్ కు సంబందించిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసు శాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద ప్రత్యేక బందోబస్తు కొనసాగుతుందన్నారు. అంతకు ముందు ఆయన స్థానిక పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఆమనగల్ పోలీస్ సర్కిల్ పరిధిలో నామినేషన్ కేంద్రాల్లో చేపట్టిన భద్రత చర్యలు, బందోబస్తు తదితర అంశాలను తెలుసుకొని పలు సలహాలు సూచనలు తెలిపారు.

**చెక్ పోస్ట్ ల తనిఖీ**

గ్రామపంచాయతి ఎన్నికల నేపథ్యంలో, కడ్తాల పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల గెట్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన తనిఖీలు, రిజిస్టర్ పరిశీలనతో పాటు, సిబ్బంది పనితీరును క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే సమాచారం అందిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.అనంతరం పోలింగ్‌కు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ, బృందాల మోహరింపు వంటి అంశాలను సమీక్షించారు.ఎన్నికల నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) అమలు విషయంలో సిబ్బందిని మరింతగా అప్రమత్తం చేయాలని సూచించారు, నామినేషన్ కేంద్రంలో అభ్యర్థుల రాకపోకలు, భద్రత, చర్యలను పరిశీలించి సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారని ఇన్స్పెక్టర్ గంగాధర్ తెలిపారు.

# కాంగ్రెస్‌లో చేరికలు




**ఆదిలాబాద్ మహా:** స్థానిక సంస్థల ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి.ఆదివారం సాత్నాల మండలం మేడిగూడ (ఆర్ ) గ్రామంనుండి స్థానిక కాంగ్రెస్ నాయకులు దినేష్ ,రవీందర్ రెడ్డి,శివప్రసాద్ రెడ్డి,శ్యాం, రామన్న ఆధ్వర్యంలో పలువురు కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే బేల మండలం నుండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం బేల గ్రామ సంచాయతీకి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అలాగే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావర్ పరిశీలనలో సర్పంచ్ అభ్యర్థిగా పోట్లి వైశాలితో పాటు పలువురు వార్డ్ మెంబర్ అభ్యర్థులను ఖరారు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ గిమ్మ సంతోష్ రావు, మునిగెల విఠల్ , రాందాస్ నాక్లే, మినుకు నారాయణ రెడ్డి , అల్చెట్టి నాగన్న, శ్రీలేఖ, రాంరెడ్డి, దేరాకృష్ణా రెడ్డి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# మద్యం పట్టివేత..

**కేసులు నమోదు**

**అమనగల్లు, మహా :** మాడ్గుల మండలంలో ఆదివారం స్థానిక పోలీసులు, ఎస్ ఎచ్ ఓ ఆధ్వర్యంలో బెల్టు షాపులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. మండలంలోని నాగిళ్ళ, కోల్కులపల్లి, బ్రాహ్మణ పల్లి, అర్కపల్లి గ్రామాల్లో బెల్టు దుకాణాలపై పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.మద్యం దుకాణాల్లో యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జరుపుతున్నారని అందిన సమాచారం మేరకు ఆయా గ్రామాల్లోని బెల్టు షాపులపై నిర్వహించిన దాడుల్లో లభించిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామని సిఐ వేణుగోపాల్ రావు తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వవుంచి అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.





# వేగం నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం -ఎస్పీ

**ఆదిలాబాద్, మహా :** వాహన ప్రమాదాలకు అతివేగం కారణమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ఆదివారం ఉదయం నాలుగున్నర గంటల సమయంలో హైదరాబాద్ నుండి ఉత్తరప్రదేశ్ లోని గోరఖ్పూర్ కు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు, 44వ జాతీయ రహదారిపై నేరేడు గుండా మండలం బోథ్ ఎక్స్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బస్సు కండక్టర్ గోరక్ పూర్ కు చెందిన రవి సింగ్ , నాలుగు సంవత్సరాల బాలుడు డిప్సన్ నిషాద్ మరణించారు. బాలుడి తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు కావడంతో, ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్నారు. ప్రమాదానికి బస్సు డ్రైవర్ అజాగ్రత్త నిర్లక్ష్యం కారణంగా తెలుస్తోందని ఎస్పీ అన్నారు. ప్రయాణికులు వారిస్తున్నాఅతివేగంగా వాహనాన్ని నడిపి ప్రమాదానికి కారణమయ్యారన్నారు. బాలుడి తండ్రి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నేరడిగొండ పోలీస్ స్టేషన్ లో డ్రైవర్ గోవింద్ ప్రసాద్ జైస్వాల్ పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పరిశీలించారు.నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్ల ప్రమాదానికి గురవుతారని, అతివేగం ప్రాణాపాయమని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలకు గురవుతున్న ప్రదేశాలలో రంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నిరంతరం వాహనదారులు హెచ్చరిక బోర్డులు ఉన్న ప్రదేశాలలో వేగాన్ని నియంత్రించి వాహనాలను నడపాలని సూచించారు.




# కాంగ్రెస్ సమీక్షా సమావేశం

**ఆదిలాబాద్ మహా :** అందరు కలిసికట్టుగా శ్రమించి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సెంట్రల్ గార్డెన్ లో జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం దక్కుతుందని అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను బేస్ గా చేసుకుని గ్రామస్థాయి నుండి బలోపేతం చేద్దామన్నారు. పార్టీ కోసం అందరిని కలుపుకు పోతానని స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో డిసిసిబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి,జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మాజీ ఎంపీ సోయం బాపూరావు ,మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు,బోథ్ అసెంబ్లీ ఇంచార్జ్ ఆడే గజేందర్,ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ,మాజీ జెడ్పిటిసి గోక గణేష్ రెడ్డి,గిమ్మ సతోష్ రావు జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సొంత నిధులతో అండర్ డ్రైనేజ్ కాలువలు నిర్మించుకుంటున్న కాలనీ వాసులు



**మొయినాబాద్ మహా:** ఎవరో వస్తారో ఏదో చేస్తారని ఆశించకుండా.. కాలనీ అభివృద్ధి కోసం అధికారులు చుట్టు తిరిగి తిరిగి విసుగు చేసి వారే కాలనీ వాసులు అందరి కలిసి డబ్బులు పోగేసుకొని కాలనీ అభివృద్ధికి పూనుకున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని మొయినాబాద్ వార్డు పరిధిలోని భరద్వాజ కాలనీలో కాలనీ వాసులు కలిసి అండర్ డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి పూనుకున్నారు. దాదాపు పది లక్షలు రూపాయలతో నిర్మిస్తున్న కాలువల నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా తమ కాలనీలో అండర్ డ్రైనేజ్ మురుగు కాలువలు నిర్మించాలని అధికారుల చుట్టూ, కార్యాలయాల చుట్టు తిరిగిన ప్రయోజనం లేకుండా పోయిందని పేర్కొన్నారు. అందుకే తామే సొంత డబ్బులతో అండర్ డ్రైనేజ్ మురుగు కాలువల నిర్మాణానికి ముందుకు వచ్చామని చెప్పారు. ఎవరో వచ్చి ఏదో చేస్తారని కాకుండా మేమే అందరం ఏక తాటిపై ఉండి అభివృద్ధి పనులు చేసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు భరద్వాజ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని వారు కోరారు. అయితే భరద్వాజ కాలనీలో నిర్మిస్తున్న అండర్ డ్రైనేజ్ మురుగు కాలువ నిర్మాణానికి దాదాపు రూ. పది లక్షలతో నిర్మిస్తుండగా అందులో రూ. ఐదు లక్షలు కేవీఎం ఆర్ శర్మ ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పీ.మల్లేష్, ఉపాధ్యక్షుడు సయ్యద్ సలీం, ప్రధాన కార్యదర్శి బీ.కుమార్, అదనపు కార్యదర్శి గఫర్, అకౌంటెంట్ కంచె నరసింహులు, జాంగిర్ కాలనీ వాసులు ఉన్నారు.

# జిల్లా వ్యాప్తంగా కార్మిక శాఖ మంత్రి వివేక్ జన్మదిన వేడుకలు



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా చెన్నూరు ఎమ్మెల్యే, కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు ఆదివారం వివిధ ప్రాంతాలలో వేరువేరుగా ఘనంగా జరిగాయి. మంచిర్యాల జిల్లా డిసిసి అధ్యక్షులు రఘునాథ్ రెడ్డి, సీనియర్ నాయకులు సుధా మల్ల హరికృష్ణ, అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు బండి సదానందం యాదవ్, కొడ్నాల శ్రీనివాస్, రాగిడి రామ్ రెడ్డి లు మంచిర్యాల మంత్రి నివాసంలో కేకు కట్ చేసి, మిఠాయిల పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి తల సేమియా సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు, రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా అందజేశారు. మందమర్రి మున్సిపాలిటీ కార్మికులకు కమిషనర్ తుంగపండి రాజలింగుచే మంచిర్యాల జిల్లా నృత్య కళా సమాఖ్య అధ్యక్షులు హనుమండ్ల మధు, కాంగ్రెస్ నాయకులు రాకం సంతోష్ ఆధ్వర్యంలో మందమర్రి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, పుల్లూరి లక్ష్మణ్, సొత్కు సుదర్శన్, రాయబారపు కిరణ్, ఎర్ర రాజు తదితరులు సాయిబాబా దేవాలయంలో పూజలు నిర్వహించారు. కురుమ సంఘం రాష్ట్ర నాయకులు గుంట శ్రీశైలం యాదవ్ నార్లాపూర్ గ్రామంలో మంత్రి వివేక్ జన్మదిన సందర్భంగా నిరుపేదలకు బ్రాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేసి ప్రత్యేక రాష్ట్రం రావడానికి కీలక పాత్ర మంత్రి వివేకానంద పోషించారని వివరించారు. చెన్నూరు నియోజకవర్గ ప్రజల అవసరాలను అనునిత్యం తీరుస్తున్న మహోన్నత నాయకుడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చెన్నూరు పట్టణంలో కొమ్మెర గ్రామానికి చెందిన జనగామ పవన్ ధాన్యం గింజలతో మంత్రి వివేక్ చిత్రపటాన్ని గీసి తన అభిమానాన్ని చాటుకున్నారు

# గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా గెలిపించండి

**కనకమామిడి సర్పంచ్ అభ్యర్థి మర్రి గీత రవీందర్ రెడ్డి**



**మొయినాబాద్, మహా:** కనకమామిడి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా తనను సర్పంచ్ గా గెలిపించాలని సర్పంచ్ అభ్యర్థి మర్రి గీత రవీందర్ రెడ్డి ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. కనకమామిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మర్రి గీత రవీందర్ పోటీ చేస్తుండగా ఆమె గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరిని కలిసి ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు. తనను గెలిపిస్తే గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతానని ప్రత్యేకంగా ఓట్లను అభ్యర్థిస్తున్నారు. గ్రామానికే సేవ చేసే అవకాశం తనకు ఇవ్వాలని ఓటర్లను కోరుతున్నారు. గ్రామంలో యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అర్హులైన పేదల అందరికీ ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు చేరే విధంగా పని చేస్తానని చెప్పారు. గ్రామస్థులు అందరూ కలిసి తనను గెలిపించాలని కోరారు. బాలకృష్ణ రెడ్డి, ఆలూరి మహేష్ యాదవ్ గ్రామస్థులు ఉన్నారు.

# నామినేషన్ల స్వీకరణ



**ఆమనగల్లు, మహా:** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఆదివారం అధికారులు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించారు. మొదటి రోజే ఆమనగల్లు మండలంలో ఆయా గ్రామాల్లో సర్పంచ్ పదవులను పోటీ కోసం 11 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అదేవిధంగా 17 మంది వార్డు సభ్యుల కోసం నామినేషన్లు ఇచ్చారనీ తెలిపారు. మొత్తం మొదటి రోజు 13 గ్రామ పంచాయతీలకు 11 మంది సర్పంచులకు 17 మంది వార్డు సభ్యుల పదవుల కోసం నామినేషన్లు స్వీకరించినట్లు సహాయక జిల్లా ఎన్నికల అధికారి ఎంపీడీవో కుసుమ మాధురి తెలిపారు.నామినేషన్ల కేంద్రాలను ఎన్నికల అధికారి పరిశీలించారు.

## నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన రాజేంద్రనగర్ జోన్ అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ రావు

**మొయినాబాద్ మహా:** గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల రెండవ విడత నామినేషన్లు ఆదివారం ప్రారంభం కావడంతో ఈ సందర్భంగా మొయినాబాద్ మండలంలోని అప్పారెడ్డిగూడ, కనకమమిడి, కేతిరెడ్డిపల్లి గ్రామాలకు సంబంధించిన కనకమామిడి గ్రామ పంచాయతీ నామినేషన్ కేంద్రాన్ని రాజేంద్రనగర్ జోన్ అదనపు డీసీపీ కె.శ్రీనివాస్ రావు,ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ విధుల్లో ఉన్న సిబ్బందితో మాట్లాడి.. నామినేషన్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా కొనసాగాలని సూచించారు. ఎలాంటి అంతరాయం లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్, సీఐ పవన్ కుమార్ రెడ్డి, ఎస్సై వెంకన్న, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లులో పంచాయతీ ఎన్నికల వేడి




**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు మండలంలో రెండో విడత పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంది. సర్పంచ్ పదవికి మాజీలతో పాటు యువకులు ఉత్సాహంగా బరిలో నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. అధికార కాంగ్రెస్లో వర్గ పోరు తీవ్రంగా ఉండగా, టికెట్ల కోసం నేతల ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ,దీటైన అభ్యర్థులను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతున్నాయి.ఆమనగల్లు మండలంలో 13 సర్పంచ్, 112 వార్డులు, కడ్తాలలో 24 పంచాయతీలు, 210 వార్డులు, తలకొండపల్లి మండలంలో 32 పంచాయతీలు, 272 వార్డులకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటికే బ్యాలెట్ బాక్సులు మండల కేంద్రానికి చేరుకున్నట్లు ఆమనగల్లు, కడ్తాల్,తలకొండపల్లి మండలాల ఎంపీడీవోలు తెలిపారు.మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గ్రామాల్లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల వేడి మొదలైంది. ఆయా గ్రామపంచాయతీలో ఆశావాహులుగా ఉన్న సర్పంచ్ అభ్యర్థులు,వార్డు సభ్యులు నామినేషన్లను వేస్తున్నారు. ముహూర్త బలాలు చూసుకుంటూ నామినేషన్ వేసేందుకు అభ్యర్థుల సిద్ధమవుతున్నారు. గ్రామపంచాయతీల్లో పోటీలో ఉండే సర్పంచ్, వార్డ్ మెంబర్ అభ్యర్థులు వారికి కేటాయించిన క్లస్టర్లలో నామినేషన్లను అందజేస్తున్నారు.

**మొదటిసారిగా 'నోటా'**

గ్రామపంచాయతీ ఎన్నికల్లో మొదటిసారిగా “నోటా” ను ప్రవేశ పెట్టినట్లు మండల అభివృద్ధి అధికారి కుసుమ మాధురి తెలిపారు. ఎన్నికల్లో పోటీల్లో ఉన్న అభ్యర్థుల్లో ఎవరు నచ్చకపోతే నోటాకు ఓటు వేసే అవకాశం ఉందని అన్నారు. ఇప్పటివరకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనే నోటా ఉండగా ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో నోటాను ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిందన్నారు.

# గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నిలదీయండి



- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎగిరేది గులాబీ జెండాయే: మాజీ మంత్రి హరీష్ రావు
- బీఆర్ఎస్ లో చేరిన బీజేపీ నాయకులు

**ఆమనగల్లు, మహా:** కేంద్రంలోని బీజేపీ,రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కల్వకుర్తి నియోజకవర్గం, ముద్విన్ గ్రామానికి చెందిన బీజేపీ కీలక నాయకులు మూకుమ్మడిగా ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ గూటికి చేరారు.హైదరాబాద్ లోని మాజీ మంత్రి హరీష్ రావు నివాసంలో, కల్వకుర్తి నియోజకవర్గ బీ.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.ముద్విన్ గ్రామానికి చెందిన మారగోని నర్సింహతో పాటు సీనియర్ నాయకులు గురిగల మహేష్, పట్నం శ్రీను, పట్నం నరేష్, జీల శ్రీశైలం, దొడ్లపాటి నర్సింహ, మారమూని మల్లయ్య, గంగాపురం రాకేష్ సహా సుమారు 60 మంది కార్యకర్తలు బీఆర్ఎస్ లో చేరారు. వారికి హరీష్ రావు గారు గులాబీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతు కాంగ్రెస్ బీజేపీలు తోడు దొంగలని,రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా చేతులెత్తేసిందని హరీష్ రావు మండిపడ్డారు.8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా రాష్ట్రానికి ఒక్క మెడికల్ కాలేజీ తేలేకపోయారని, పక్క రాష్ట్రాలకు వేల కోట్లు ఇస్తుంటే మనకు గుండు సున్నా మిగిల్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం మనకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నించడంలో, రాష్ట్ర హక్కులను కాపాడటంలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. గల్లీలో కుస్తీ.. ఢిల్లీలో దోస్తీ అన్నట్లుగా వీరి వ్యవహారం ఉందని హామీలు అమలు చేయకపోగా, ప్రజలకే కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందని హరీష్ రావు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను.. మా బాకీ పైసలు ఎప్పుడిస్తారు అని ప్రజలు నిలదీయాలని పిలుపునిచ్చారు.ఒకప్పుడు కేసీఆర్ హయాంలో కళకళలాడిన కల్వకుర్తి,హైదరాబాద్ పరిసర ప్రాంతాలు..నేడు రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతున్నాయని అన్నారు. రియల్ ఎస్టేట్ రంగాన్ని కుదేలు చేసి, సామాన్యుడి ఆస్తి విలువను పాతాళానికి తొక్కేశారని అన్నారు. తెలంగాణ అస్తిత్వం నిలబడాలన్నా, అభివృద్ధి పరుగులు పెట్టాలన్నా అది కేవలం కేసీఆర్ నాయకత్వం తోనే సాధ్యం. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచే ఏకైక నాయకుడు కేసీఆర్. ఉమ్మడి మహబూబ్ నగర్జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ బలంగా ఉంది. జైపాల్ యాదవ్ గారి నేతృత్వంలో కల్వకుర్తిలో మళ్ళీ గులాబీ జెండా ఎగురవేస్తాం. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్,సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు.లక్ష్మీ నరసింహ రెడ్డి,పాక్స్ చైర్మెన్ గంప వెంకటేష్,మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సన్నకారు రైతులను న్యాయం చేయండి

**ఎంపీ వద్దిరాజు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, ప్రముఖులతో కేంద్ర పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారుల భేటీ**



**ఆమనగల్లు, మహా:** బీదర్ మహేశ్వరం 765 KV విద్యుత్ లైన్ కారణంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన రైతులకు నష్టం జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లు సెంట్రల్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులను కోరారు.బీదర్ మహేశ్వరం (బేగరకంచ) 765 KV హై టెన్షన్ విద్యుత్ లైన్ పవర్ గ్రిడ్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్నది.ఈ లైన్ వల్ల విలువైన తమ భూములు కోల్పోవాల్సి వస్తున్నదని,పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లనుందని, దీన్ని నివారించాలంటూ రైతులు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తో కలిసి ఎంపీ రవిచంద్రను సంప్రదించారు.అలాగే,ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ. రామారావు దృష్టికి తీసుకుపోగా,ఆయన సూచన మేరకు ఎంపీ రవిచంద్ర,జైపాల్ యాదవ్ ల ఆధ్వర్యాన బాధిత రైతులు నవంబర్ 3వతేదీన ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ను కలిశారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, జైపాల్ యాదవ్ కేంద్ర మంత్రి ఖట్టర్ కు వినతిపత్రమిచ్చి రైతులకు నష్టం జరుగకుండా చూడాలని, న్యాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.మంత్రి ఖట్టర్ వెంటనే సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా చూడాల్సిందిగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులకు తగు ఆదేశాలిచ్చారు.ఈ మేరకు కార్పోరేషన్ సీజీఎం బిపిన్ బీహారీ రథ్, సీనియర్ కన్సెల్టెంట్ అశోక్,డీజీఎం సంతోష్ తదితరులు ఆదివారం ఎంపీ రవిచంద్ర,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహారెడ్డిలతో పాటు రైతులతో సమావేశమయ్యారు.హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ రవిచంద్ర క్యాంప్ కార్యాలయంలో సుమారు 3గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఈ విద్యుత్ లైన్ ఏర్పాటు వల్ల రైతులకు అన్యాయం జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా కోరారు.ఎంపీ వద్దిరాజు,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లు విద్యుత్ లైన్ మ్యాపులను అధికారులకు చూపిస్తూ పలు సూచనలు చేశారు,సలహాలిచ్చారు. రవిచంద్ర, జైపాల్ యాదవ్ ల సూచనలు,రైతుల ఆవేదన, ఆందోళన గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అన్యాయం జరుగకుండా చూస్తానని సీజీఎం బిపిన్ బీహారీ రథ్ హామీనిచ్చారు.ఈ సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గంపా వెంకటేష్,రైతులు పిప్పల వెంకటేష్,కదారి రామకృష్ణ,గూడూరు పెంటారెడ్డి, గూడె పర్వతాలు, జెల్లా శివరామకృష్ణ, క్యామ సత్యం,గూడె రాములు,కందికంటి శ్రీరాములు, అభిషేక్ రెడ్డి,గూడె రాజు, రాజేందర్ యాదవ్,వరికుప్పల యాదయ్య, కందికంటి కేశవులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా :** విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య అన్నారు. ఆదివారం జిల్లా షెడ్యూల్డ్ కులముల బాలికల కళాశాల, సంక్షేమ వసతి గృహాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సులను ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రపంచంలో భారత్ దేశంలో మాత్రమే నైపుణ్యాలతో కూడిన యువత అందుబాటులో ఉందని, విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించి మంచి స్థానాల్లో స్థిరపడాలని ఆకర్షించారు. అనంతరం విద్యార్థులకు చలికాలం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కె ధర్మానంద్ గౌడ్, వసతి గృహ సంక్షేమ అధికారి డి చందన తదితర విద్యార్థినీలు పాల్గొన్నారు.

# కోట్లు గుమ్మరించి 10 ఆఫీసులు కొన్న హృతిక్ రోషన్

సెలబ్రిటీలు తమకు ఇష్టమైన కార్లు, బైకులు కొనుగోలు చేయడంతో పాటు.. రియల్ ఎస్టేట్‌లో కూడా పెట్టుబడులు పెడుతున్నారు. ఇందులో భాగంగానే.. నటుడు హృతిక్ రోషన్.. అతని తల్లి దండ్రులు రాకేష్ రోషన్ & ప్రమీలా రోషన్‌లతో కలిసి అంధేరీ వెస్ట్‌లో 10 ఆఫీస్ యూనిట్లను రూ.28 కోట్లకు కొనుగోలు చేశారు. హృతిక్ రోషన్.. యురా బిజినెస్ పార్క్ 3వ, 4వ అంతస్తులలో ఉన్న 10 ఆఫీస్ యూనిట్లను రెండు కంపెనీల ద్వారా కొనుగోలు చేశారు. వీటిని హెచ్‌ఆర్‌ఎక్స్ డిజిటెక్ ఎల్ఎల్పీ, ఫిల్మ్‌కుంజ్ (బాంబే) ప్రైవేట్ లిమిటెడ్ పేర్లమీద రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొత్తం 10 ఆఫీసులలో.. ఐదు ఆఫీసులను హెచ్‌ఆర్‌ఎక్స్ డిజిటెక్ ఎల్ఎల్పీ కొనుగోలు చేసినట్లు, ఫిల్మ్‌కుంజ్ (బాంబే) ప్రైవేట్ లిమిటెడ్ మిగిలిన ఐదు ఆఫీసులను కొనుగోలు చేసినట్లు సమాచారం. దీనికి సంబంధించిన లావాదేవీలు 2025 నవంబర్ 27న జరిగినట్లు తెలుస్తోంది. మొత్తం ఆఫీస్ స్థలం 6968 చదరపు అడుగులు. ఒక్కో యూనిట్ పరిమాణం 769 చదరపు అడుగుల నుంచి 852 చదరపు అడుగుల వరకు ఉంటుంది. విక్రేత పేరు యురా బిజినెస్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్ (పెకాన్ అండ్ ట్రాన్స్‌కాన్ గ్రూప్) అని తెలుస్తోంది.. హృతిక్ రోషన్ కుటుంబం.. నవంబర్ 19, 2025న అంధేరీలో రూ.19.68 కోట్ల విలువైన ఐదు కమర్షియల్ ఆఫీస్ యూనిట్లను కొనుగోలు చేశారు. స్క్వేర్ యార్డ్స్ డాక్యుమెంట్స్ ప్రకారం, వీటిని వైద్య స్పేసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నుండి కొనుగోలు చేశారు. ఆ తరువాత నవంబర్ 24 హృతిక్ సోదరి సునైనా రోషన్ కూడా అంధేరీ ఈస్ట్‌లో రెండు ఆఫీస్ యూనిట్లను రూ. 6.42 కోట్లకు కొనుగోలు చేసింది.







# ధనికులయ్యే తొలి కిటుకు చెప్పేసిన కియోసాకి..

ప్రపంచ ఆర్థిక అంశాలు, పెట్టుబడులపై ఎప్పటికప్పుడు వ్యాఖ్యానించే ప్రముఖ ఆర్థిక రచయిత రాబర్ట్ కియోసాకి ఒక కఠినమైన హెచ్చరికను జారీ చేశారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ ప్రపంచ ఆస్తి బుడగ పేలడం ప్రారంభించిందని, అత్యంత ప్రభావవంతమైన "క్యారీ ట్రేడ్"కు జపాన్ ముగింపు పలుకుతోందని హెచ్చరించారు. ప్రసిద్ధ 'రిచ్ డాడ్ పూర్ డాడ్' (Rich Dad Poor) రచయిత.. జపాన్ "క్యారీ ట్రేడ్" అంటే అతి తక్కువ వడ్డీ రేట్లకు రుణాలు ఇచ్చే దీర్ఘకాల పద్ధతి గురించి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విటర్) లో వరుస పోస్టులలో వ్యాఖ్యానించారు. ఈ విధానం ద్వారా ప్రపంచ రియల్ ఎస్టేట్, ఈక్విటీలు, బాండ్లు, కమాడిటీలు, ప్రైవేట్ వ్యాపారాలలోకి ప్రవహించిన మూలధనం ప్రపంచవ్యాప్తంగా వాటి ధరలను పెంచడానికి సహాయపడిందని పేర్కొన్నారు. కియోసాకి (Robert Kiyosaki ) ప్రకారం.. ఈ అనూహ్య తిరోగమనం ఇప్పుడు యు.ఎస్. థాంక్స్ గివింగ్ సమయంలో "చరిత్రలో అతిపెద్ద క్రాష్"ను ప్రేరేపిస్తోంది. మార్కెట్లు కుదుపునకు లోనవుతున్నప్పుడు ఆ సంక్షోభానికి చిక్కకుండా ధనవంతులు కావడానికి ఏం చేయాలో తాను 10 వ్యూహాలను చెబుతానన్న కియోసాకి తన తొలి కిటుకును బయట పెట్టేశారు.

**తొలి వ్యూహం ఇదే..**

కియోసాకి మొదటి సూచన చమురు, సహజ వాయువు వంటి ఇంధనాలపై పెట్టుబడులు పెట్టడం. కృత్రిమ మేధస్సులో వేగవంతమైన పురోగతి ప్రపంచ ఇంధన డిమాండ్‌ను గణనీయంగా పెంచుతుందని, సాంప్రదాయ ఇంధన ఉత్పత్తిదారులు ప్రయోజనం పొందుతారన్న ఆయన తాను ఇంధన రంగంలోనే పెట్టుబడుతున్నట్లు వెల్లడించారు. కోట్లాది మంది ఉద్యోగాలు పోయి, ఆస్తులు పోగొట్టుకుని బికారులయ్యే ఈ తరుణంలో 'నేను ధనవంతున్ని కావాలని ప్లాన్ చేస్తున్నాను' అంటూ రాసుకొచ్చిన ఆయన ఉద్యోగ మార్కెట్‌పైనే రియల్ ఎస్టేట్ మార్కెట్ ఆధారపడి ఉంటుందన్న తన 'రిచ్ డాడ్' పాఠాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిపోయినా మీరు మాత్రం ధనికులు కావచ్చని తనను అనుసరించేవారికి కియోసాకి సూచించారు. తన నుంచి మరిన్ని సూచనలు రాబోతున్నాయన్న ఆయన ఇవి కేవలం తన సూచనలు మాత్రమేనని, సిఫార్సులు కాదని స్పష్టం చేశారు.

# ఎఫ్ఎస్‌టీసీలో అదానీ గ్రూప్‌నకు వాటాలు




డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ గ్రూప్ తాజాగా పైలట్లకు శిక్షణ విభాగంలోకి ప్రవేశిస్తోంది. ఇందుకు సంబంధించి ఫ్లైట్ సిమ్యులేషన్ టెక్నిక్ సెంటర్ (ఎఫ్ఎస్‌టీసీ)లో 72.8 శాతం వాటాలు కొనుగోలు చేస్తోంది. అదానీ డిఫెన్స్ సిస్టమ్స్ అండ్ టెక్నాలజీస్ (ఏడీఎస్‌టీఎల్), దానికి 50 శాతం వాటాలున్న హొరైజన్ ఏరో సొల్యూషన్స్ (హెచ్ఏఎస్ఎల్) సుమారు రూ. 820 కోట్లు వెచ్చించనున్నాయి. ఎఫ్ఎస్‌టీసీకి హైదరాబాద్‌తో పాటు గురుగ్రామ్‌లో సిమ్యులేషన్ సెంటర్లు ఉన్నాయి. హర్యానాలోని భివాని, నార్నౌల్‌లో ఫ్లయింగ్ స్కూల్స్ నిర్వహిస్తోంది. సంస్థ 11 అధునాతన ఫుల్ ఫ్లయిట్ సిమ్యులేటర్లు, 17 ట్రైనింగ్ విమానాలు ఉన్నాయి. కమర్షియల్ పైలట్ లైసెన్సులకు శిక్షణ, ప్రత్యేక నైపుణ్యాల కోర్సులను అందిస్తోంది.

## ఉత్పత్తిలో సరికొత్త రికార్డ్!.. కంపెనీ నుంచి మరో బైక్




టీవీఎస్ మోటార్ కంపెనీ & బీఎండబ్ల్యూ మోటోరాడ్ తమ దీర్ఘకాల భాగస్వామ్యంలో రెండు లక్షల యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరుకున్నట్లు ప్రకటించింది. 2013లో ఇరు కంపెనీలు కలిసినప్పటి నుంచి సబ్ 500సీసీ విభాగంలో కీలక పాత్ర పోషించింది. ఆ తరువాత జీ 310 ఆర్, జీ 310 జీఎస్, జీ 310 ఆర్ఆర్ మోడల్స్ పుట్టుకొచ్చాయి. ఇవి ఎక్కువగా అంతర్జాతీయ మార్కెట్లో అమ్ముడయ్యాయి. 'బీఎండబ్ల్యూ మోటోరాడ్'తో దశాబ్ద కాలంగా కొనసాగుతున్న మా భాగస్వామ్యంలో.. ఆవిష్కరణ & నాణ్యత భాగస్వామ్య విలువలు, విజయానికి పునాదిగా నిలిచాయి. మేము యూరప్, అమెరికా & ఆసియాలోని ప్రముఖ మార్కెట్లలోని అనేక కొత్త ఉత్పత్తులను రూపొందించామని టీవీఎస్ మోటార్ కంపెనీ డైరెక్టర్ అండ్ సీఈఓ కేఎన్ రాధాకృష్ణన్ అన్నారు. రెండు లక్షల ఉత్పత్తి మైలురాయిని చేరుకున్న సందర్భంగా.. టీవీఎస్ హోసూర్ తయారీ కేంద్రం నుంచి బీఎండబ్ల్యూ ఎఫ్ 450 జీఎస్ అడ్వెంచర్ బైక్ ఉత్పత్తి ప్రారంభమైంది. ఇది రెండు కంపెనీల ప్రయాణానికి గొప్ప అధ్యాయం అని బీఎండబ్ల్యూ మోటోరాడ్ సీఈఓ మార్కస్ ఫ్లాష్ పేర్కొన్నారు.

**బీఎండబ్ల్యూ ఎఫ్ 450 జీఎస్**

బీఎండబ్ల్యూ ఎఫ్ 450 జీఎస్ బైక్.. 420సీసీ ప్యారలల్ ట్విన్ ఇంజిన్‌తో 8,750 rpm వద్ద 48 bhp & 6,750 rpm వద్ద 43 Nm టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 6స్పీడ్ గేర్‌బాక్స్ ఆప్షన్ పొందుతుంది. బీఎండబ్ల్యూ బేస్ మోడల్ మినహా అన్నింటిలోనూ క్విక్‌షిఫ్టర్‌ను అందిస్తుంది, అయితే టాప్ స్పెక్ జీఎస్ ట్రోఫీ ఈజీ రైడ్ క్లచ్ సిస్టమ్‌ను పొందుతుంది.

## క్రీడా వార్తలు | SPORTS NEWS

# రాంచీలో భారత్ శుభారంభం!

## రికార్డుల దండయాత్ర

- కోహ్లీ 52వ శతకం, రోహిత్ సిక్సర్ల ప్రపంచ రికార్డు
- దక్షిణాఫ్రికా పోరాటాన్ని చిత్తు చేసిన భారత యువ బౌలర్లు
- వన్డేల్లో 'సిక్సర్ల కింగ్'..అఫ్రిదిని దాటేసిన రోహిత్
- హర్షిత్ రాణా డబుల్ స్ట్రైక్, కుల్‌దీప్ మాయాజాలం
- భారత బౌలింగ్ పదునుకు దక్షిణాఫ్రికా బెంబేలు
- టెస్ట్ వైఫల్యం మర్చి... వన్డే సిరీస్‌లో భారత్ విజయ గర్జన!






**రాంచీ,మహా:** ఉద్వేగం ఉప్పొంగింది... రికార్డులు సృష్టించబడ్డాయి... చివరకు భారత్ విజయం సాధించింది! రాంచీ క్రీడా మైదానం, భారత క్రికెట్ చరిత్రలో మరో చారిత్రక ఘట్టానికి సాక్ష్యంగా నిలిచింది! టెస్ట్ సిరీస్‌లో ఎదురైన వైఫల్యాన్ని ఒక్కసారిగా తుడిచిపెడుతూ, భారత వీరులు తమ బ్యాటింగ్ పరాక్రమాన్ని విశ్వరూపంలా ప్రదర్శించారు. ఒకవైపు విరాట్ కోహ్లీ, తన బ్యాట్ అంచున అగ్నిని రాజేస్తూ, తన కెరీర్‌లో 52వ శతకంతో సింహ గర్జన చేయగా... మరోవైపు, కెప్టెన్ రోహిత్ శర్మ, సిక్సర్ల సునామీ సృష్టించి, వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా ప్రపంచ రికార్డును తన పేరు మీద లిఖించుకున్నాడు! వీరిద్దరి పరాక్రమంతో భారత స్కోరు 349 పరుగులకు చేరగా, ఆ తర్వాత యువ పేసర్ హర్షిత్ రాణా తన మొదటి ఓవర్‌లోనే డబుల్ స్ట్రైక్ ఇచ్చి దక్షిణాఫ్రికా శిబిరంలో ఆందోళన కలిగించాడు. చివరకు, దక్షిణాఫ్రికా పోరాటం ఉత్కంఠను పెంచినా, భారత బౌలర్ల వ్యూహాత్మక ప్రదర్శన ముందు తలవంచక తప్పలేదు. ఈ ఉత్కంఠభరిత పోరులో భారత్, విజయాన్ని తన కైవసం చేసుకుని, వన్డే సిరీస్‌ను అత్యద్భుతంగా ప్రారంభించింది!

**కోహ్లీ కదం.. 52వ శతకం, క్రికెట్ చరిత్రకు పట్టాభిషేకం**

యశస్వి జైస్వాల్ త్వరగా నిష్క్రమించినా, ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ (135) తన బ్యాటింగ్‌తో మాయ చేశాడు. 120 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్సర్లతో అద్భుతమైన ఇన్నింగ్స్‌ను ఆడిన కోహ్లీ, తన కెరీర్‌లో 52వ వన్డే సెంచరీని పూర్తి చేయడమే కాకుండా, మెన్స్ క్రికెట్ చరిత్రలోనే 7000వ అంతర్జాతీయ సెంచరీని నమోదు చేసి, తన పేరిట ఒక చారిత్రక ఘట్టాన్ని లిఖించాడు. ఇక, రోహిత్ శర్మ (57) కేవలం 51 బంతుల్లోనే 5 ఫోర్లు, 3 సిక్సర్లతో చెలరేగి, వన్డే క్రికెట్‌లో అత్యధిక సిక్సర్లు (352) కొట్టిన ఆటగాడిగా ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ ఇద్దరు దిగ్గజాల భాగస్వామ్యం దక్షిణాఫ్రికా బౌలర్లను పూర్తిగా నిస్సత్తువకు గురి చేసింది. వీరి విజృంభణ తరువాత, స్టాండిన్ కెప్టెన్ కేఎల్ రాహుల్ (60) మరియు రవీంద్ర జడేజా (32) కీలకమైన వేగవంతమైన పరుగులు జోడించడంతో, భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 349 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.

**దక్షిణాఫ్రికా పోరాటం..ఉత్కంఠ పతాక స్థాయికి..**

350 పరుగుల ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికాకు ఆరంభంలోనే యువ పేసర్ హర్షిత్ రాణా భీకరమైన షాక్ ఇచ్చాడు. తన మొదటి ఓవర్‌లోనే ఓపెనర్లు రియాన్ రికిల్టన్, క్వింటన్ డి కాక్‌లను పెవిలియన్‌కు పంపి, మ్యాచ్‌ను అగ్ని పర్వతంలా మార్చేశాడు. అర్షదీప్ సింగ్ కూడా కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్‌ను త్వరగా అవుట్ చేయడంతో, 11 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా ఓటమి అంచుకు చేరుకుందనుకున్నారు. కానీ, అక్కడి నుంచే అసలు పోరాటం మొదలైంది! మాథ్యూ బ్రీట్జ్కే (72), టోనీ డి జోర్జి (39), డెవాల్డ్ బ్రెవిస్ (37) ల చిన్న చిన్న భాగస్వామ్యాలు ఆశలు రేపాయి. ముఖ్యంగా, మార్కో జాన్సెన్ (70) మరియు కార్బిన్ బోష్ (67) జోడీ భారత బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారింది. వీరు మెరుపు వేగంతో పరుగులు చేసి, భారత శిబిరంలో ఆందోళన కలిగించారు. డ్యూ ప్రభావం, వారి దూకుడు కారణంగా మ్యాచ్ ఉత్కంఠ పతాక స్థాయికి చేరింది.

### కుల్‌దీప్ యాదవ్ మాయ.. మ్యాచ్ మలుపు

**అయితే, భారత బౌలింగ్‌కు ఆపద్బాంధవుడిగా వచ్చాడు కుల్‌దీప్ యాదవ్ (4 వికెట్లు). తన స్పిన్ మాయాజాలంతో ఈ కీలకమైన భాగస్వామ్యాన్ని విడదీయడంలో కుల్‌దీప్ సఫలమయ్యాడు. కీలక సమయంలో మాథ్యూ బ్రీట్జ్కేను అవుట్ చేసి, ఆ వెంటనే మార్కో జాన్సెన్‌ను పెవిలియన్‌కు పంపిన కుల్‌దీప్, మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పాడు. చివర్లో కార్బిన్ బోష్ అద్భుతంగా పోరాడినా, భారత పేసర్లు అర్ష్‌దీప్ సింగ్ మరియు ప్రసిద్ధ్ కృష్ణ తమ అనుభవాన్ని ఉపయోగించి వికెట్లు తీశారు. చివరికి, దక్షిణాఫ్రికా 49.2 ఓవర్లలో 332 పరుగులకే ఆలౌట్ కావడంతో, భారత్ 17 పరుగుల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్... కోహ్లీ-రోహిత్‌ల అనుభవం, రాణాల ఉత్సాహం, కుల్‌దీప్ స్పిన్ పదును – ఈ మూడింటి కలయికతో భారత్ సాధించిన అద్భుతమైన విజయంగా క్రికెట్ చరిత్రలో నిలిచిపోతుంది.**

## వేలానికి ముందు ఆండ్రీ రసెల్ కీలక నిర్ణయం



రెండో ఇన్నింగ్స్‌లోనూ కేకేఆర్‌తోనే..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 వేలానికి వెస్టిండీస్ దిగ్గజ ఆల్‌రౌండర్ ఆండ్రీ రసెల్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే, ఆటగాడిగా మాత్రమే క్యాష్ రిచ్ లీగ్‌కు గుడ్‌బై చెప్పిన రసెల్.. మరో కొత్త అవతారంలో అభిమానుల ముందుకు రానున్నట్లు తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (KKR) సహాయక సిబ్బంది బృందంలో చేరనున్నట్లు రసెల్ వెల్లడించాడు. ఈ సందర్భంగా కేకేఆర్ జట్టుతో తనకు ఉన్న అనుబంధాన్ని తెలిపేలా రసెల్ (Andre Russel) ఓ ఎమోషనల్ వీడియోను షేర్ చేశాడు. సుదీర్ఘ కాలంగా తనకు అండగా నిలిచిన కేకేఆర్ యాజమాన్యంతో పాటు అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు.

**వేలంలోకి వదిలిన కేకేఆర్**

కాగా 2012లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున ఐపీఎల్‌లో అడుగుపెట్టిన రసెల్.. 2014లో కేకేఆర్‌లో చేరాడు. ఇక అప్పటి నుంచి కోల్‌కతానే ప్రయాణం సాగించిన ఈ పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్.. జట్టులో కీలక సభ్యుడిగా ఎదిగాడు. గతేడాది టైటిల్ గెలిచిన కేకేఆర్ టీమ్‌లో అతడు మెంబర్ కూడా! ఈ క్రమంలో ఐపీఎల్ 2025 వేలానికి ముందు కేకేఆర్ రసెల్‌ను రూ. 12 కోట్ల భారీ మొత్తానికి రిటైన్ చేసుకుంది. ఈ ఏడాది 10 ఇన్నింగ్స్ ఆడి 167 పరుగులు చేసిన రసెల్.. ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. అయితే, ఈ సీజన్‌లో రహానే సారథ్యంలోని కేకేఆర్ చేదు ఫలితాలు చవిచూసింది. ఈ నేపథ్యంలో తమ ఖరీదైన ఆటగాళ్లు వెంకటేశ్ అయ్యర్ (రూ. 23.75 కోట్లు), రసెల్ (రూ. 12 కోట్లు) 2026 వేలానికి ముందు కేకేఆర్ విడిచిపెట్టింది. దీంతో రసెల్‌ను తిరిగి తక్కువ ధరకు కేకేఆర్ దక్కించుకుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం కాగా.. అతడు రిటైర్మెంట్ ప్రకటించడం విశేషం. అయితే, కోచింగ్ సిబ్బందిలో ఒకడిగా కేకేఆర్‌తో కొనసాగుతానన్న 37 ఏళ్ల రసెల్ ప్రకటన పట్ల ఆ జట్టు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక ఐపీఎల్‌లో 140 మ్యాచ్‌లు ఆడిన రస్సెల్ 2,651 పరుగులు చేయడంతో పాటు 123 వికెట్లు తీశాడు.

## టీమ్ చాంప్ హైదరాబాద్ జట్టు



**హైదరాబాద్:** అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ జట్లు సత్తా చాటాయి. మూడు వేర్వేరు విభాగాల్లో హైదరాబాద్ జట్లు చాంపియన్‌గా నిలిచాయి. మొయినాబాద్ వేదికగా తెలంగాణ టేబుల్ టెన్నిస్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీ పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు విజయం సాధించగా... రంగారెడ్డి జట్టు రెండో స్థానంలో నిలిచింది. ములుగు జిల్లాకు మూడో స్థానం దక్కింది. మహిళల విభాగంలోనూ హైదరాబాద్ జట్టు రంగారెడ్డిపై గెలుపొందింది. పెద్దపల్లి జిల్లా మూడో స్థానంలో నిలిచింది. జూనియర్ పురుషుల విభాగంలో హైదరాబాద్ జట్టు అగ్రస్థానం దక్కించుకోగా... రంగారెడ్డి జట్టు రెండో స్థానంలో నిలిచింది. జగిత్యాల జిల్లా మూడో స్థానంతో సరిపెట్టుకుంది. జూనియర్ మహిళల విభాగంలో రంగారెడ్డి జట్టు టీమ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకోగా... హైదరాబాద్, నల్లగొండ వరుసగా రెండో, మూడో స్థానాల్లో నిలిచాయి. టీమ్ చాంపియన్‌షిప్ దక్కించుకున్న హైదరాబాద్ జట్లను రాష్ట్ర టీటీ సంఘం కార్యదర్శి నాగేందర్ రెడ్డి అభినందించారు.

# పెద్ది ఓటీటీ డీల్ క్లోజ్...



ఉప్పెన ఫేం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పెద్ది'. ఇందులో చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తోంది. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నాడు. ఈ మధ్యే రిలీజ్ అయితే 'చికిరి' సాంగ్ ఎంత పెద్ద హిట్ అయిందో అందరికి తెలిసిందే. సోషల్ మీడియాలో ఎక్కడ చూసిన ఈ పాటే వినిపిస్తోంది. అంతకు ముందు విడుదలైన గ్లింప్స్‌తో పాటు ఈ పాట కూడా హిట్ కావడంతో పెద్దిపై అంచనాలు అమాంతం పెరిగాయి. సినిమాకు వచ్చిన బజ్‌తో పలు ఓటీటీ సంస్థలు డిజిటల్ రైట్స్ కోసం పోటీపడ్డాయట. ముఖ్యంగా రెండు ప్రముఖ ఓటీటీ సంస్థలు పోటీలో నిలవగా.. భారీ ధరకు నెటిఫ్లిక్స్ డిజిటల్ రైట్స్‌ని కొనుగోలు చేసినట్లు సమాచారం. దాదాపు రూ. 130 కోట్ల భారీ బడ్జెట్ పెట్టి పెద్ది కోనుగోలు చేసిందట నెట్‌ఫ్లిక్స్. అన్ని భాషలకు గాను ఈ మొత్తాన్ని చెల్లించబోతుందట. షూటింగ్ మొత్తం పూర్తయి రిలీజ్ కాబోతున్న చిత్రాలకే ఓటీటీ బిజినెస్ అవ్వడం లేదు. అలాంటిది ఇంకా షూటింగ్ కూడా పూర్తికాని పెద్ది చిత్రానికి అప్పుడే ఓటీటీ డీల్ పూర్తి కావడం గొప్ప విషయమే. మల్టీస్పోర్ట్స్ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా సిద్ధం చేయించిన భారీ సెట్‌లో ఓ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరణ జరుగుతోంది. రామ్‌చరణ్, ఇతర ఫైటర్లతో పాటు ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో కన్నడ నటుడు శివ రాజ్‌కుమార్ కూడా పాల్గొంటున్నారు. బాలీవుడ్ స్టార్ విక్కీ కౌశల్ తండ్రి, ప్రముఖ స్టంట్ డైరెక్టర్ 'దంగల్' ఫేమ్ షామ్ కౌశల్ ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను పర్యవేక్షిస్తుండగా, నవకాంత్ స్టంట్ మాస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. "ప్రతి ఫైట్ సీక్వెన్స్‌ను ప్రత్యేకమైన కాన్సెప్ట్‌తో, ఉత్కంఠభరితంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు బుచ్చిబాబు. ప్రస్తుతం జరుగుతున్న ఈ ఫైట్ సీక్వెన్స్ ఓ హైలైట్‌గా ఉంటుంది" అని యూనిట్ పేర్కొంది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 27న విడుదల కానుంది.

# ఘోస్ట్‌గా దీపికా..!



ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలో వన్ ఆఫ్ లీడింగ్ హీరోయిన్‌గా కొనసాగుతున్న భామల్లో టాప్‌లో ఉంటుంది బాలీవుడ్ నటి దీపికా పదుకొనే. ప్రభాస్‌తో కల్కి 2898 ఏడీలో మెరిసిన ఈ బ్యూటీ సీక్వెల్‌లో నటించేందుకు మాత్రం నో చెప్పిందని తెలిసిందే. దీంతోపాటు సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లో రాబోతున్న స్పిరిట్ ఆఫర్‌ను కూడా వద్దని చెప్పింది. ఈ భామ కెరీర్‌లో తొలిసారి డిఫరెంట్ రోల్ చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలువనుందన్న వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించనున్న రెండు కొత్త ప్రాజెక్టుల్లో దీపికా పదుకొనే బెంగాలీ ఘోస్ట్ (దెయ్యం) శాఖ్‌చునిగా కనిపించనుందట. ఈ బ్యానర్‌లో మ్యాడ్ డాక్ హార్రర్ కామెడీ యూనివర్స్ సూపర్ పాపులారిటీ ఉందని తెలిసిందే. తాజా టాక్ ప్రకారం ఈ టాప్ బ్యానర్ ఇటీవలే రెండు సినిమాల కోసం దీపికాపదుకొనేను సంప్రదించాయట. అయితే నిర్ణయం తీసుకోవాలంటే మొత్తం స్క్రిప్ట్ కావాలని అడిగినట్టు బీటౌన్ సర్కిల్ సమాచారం. ఇప్పటివరకు అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. తాజా వార్తలు గమనిస్తే దాదాపు ఈ సినిమాలు ఫైనల్ అయినట్టేనని అర్థమవుతోంది. ఒకవేళ ఇదే నిజమైతే దీపికా పదుకొనే కెరీర్‌లోనే ఇది కొత్త చాప్టర్ కానుందనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజా ప్రాజెక్టులతో మ్యాడ్ డ్యాక్ ఫిలిమ్స్ హార్రర్ కామెడీ యూనివర్స్ మరింత విస్తరించనుందని అర్థమవుతోంది. దీపికాపదుకొనే ప్రస్తుతం అట్లీఅల్లు అర్జున్ కాంబోలో రాబోతున్న AA22xA6 ప్రాజెక్టులో నటిస్తోంది. ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది.



# నావల్ల కాదన్నాను

షారూఖ్ ఖాన్, ఆమిర్ ఖాన్, సన్నీ డియోల్ వంటి హీరోలతో ఎక్కువగా జోడీ కట్టింది జూహీ చావ్లా. అలా సన్నీ డియోల్‌తో లూటెరే అనే హిట్ సినిమాలోనూ యాక్ట్ చేసింది. ఆ విశేషాల గురించి నిర్మాత సునీల్ దర్శన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తు చేసుకున్నాడు. ఆయన మాట్లాడుతూ.. 'జూహీ కెరీర్‌లో ముఖ్య పాత్ర పోషించిన సినిమాల్లో లూటెరె ఒకటి.

## దివ్య భారతిని కాదని..

ఆమె నటించిన సుల్తానాత్ (1986), ఖయామత్ సే ఖయామత్ టక్ (1988) సినిమలను నేనే డిస్ట్రిబ్యూట్ చేశాను. తను చాలా బాగా యాక్ట్ చేయగలదు. అందుకే లూటెరె మూవీలో తనను హీరోయిన్‌గా తీసుకున్నాం. నిజానికి దివ్య భారతి అప్పుడు ట్రెండింగ్‌లో ఉంది. తను ఈ సినిమాలో భాగం కావాలని కోరుకుంది. కానీ, ఆమె ఈ పాత్రకు సరిపోదని భావించాం. దర్శకుడు ధర్మేశ్, నేను.. తనను కాదని జూహీ చావ్లాను తీసుకున్నాం.

## గ్లామర్‌గా చూపించాం

అయితే ఈ సినిమాలో మే తేరీ రాణి తు రాజా అని ఓ బీచ్ సాంగ్ ఉంటుంది. అందులో ఆమె బీచ్‌లో షర్ట్ ధరించి నీళ్లలో తడవాల్సి ఉంటుంది. అప్పటిదాకా పక్కింటి అమ్మాయి ఇమేజ్‌తో ఉన్న జూహీ చావ్లా.. సడన్‌గా గ్లామర్‌గా కనిపించాలంటే కొంత భయపడింది. కానీ కథ మొత్తం చెప్పాకే తను సినిమా చేసేందుకు ఒప్పకుంది. కాబట్టి చేయక తప్పలేదు.

## ముద్దు సన్నివేశం

అలాగే హీరోతో ముద్దు సన్నివేశం ఉంటుందని కూడా చెప్పాం. అలా మొదట్లో సీన్ షూట్ చేశాం. అయితే ఔట్‌డౌర్‌లో ఆ సీన్ తీస్తే బాగుంటుందనుకున్నాం. అంతా సిద్ధం చేసుకున్నాక జూహీ రాలేదు. తనకు వేరే షూటింగ్ ఉందని సాకు చెప్పి తప్పించుకుంది. సినిమాకు ఆ సన్నివేశం కీలకమని, ఏదో సంచలనం కోసం దాన్ని షూట్ చేయట్లేదని దర్శకుడు అన్నాడు.

## రీటేక్‌కు ఒప్పకోలేదు

అలా సన్నీ డియోల్ , జూహి (Juhi Chawla)తో ముద్దు సీన్ తీశారు. అప్పటికీ అది సరిగా రాలేదని రీటేక్ చేయాలన్నాడు. దీంతో ఆగ్రహానికి లోనైన జూహి.. కాంట్రాక్ట్‌లో ఒక ముద్దు సన్నివేశంలో మాత్రమే నటిస్తానని చెప్పాను. అది ఆల్‌రెడీ చేశానుగా అని వాదించింది. అందుకని ఆమెను బలవంతం చేయకుండా ఫస్ట్ తీసిన సీన్‌ను అలాగే ఉంచాం. ఆ సినిమా జూహి కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రాల్లో ఒకటిగా నిలిచింది' అని సునీల్ దర్శన్ చెప్పకొచ్చాడు.



# అందాల ఆరబోత.. ఎవరిష్టం వారిది!

ఒకప్పటి హీరోయిన్లను ఇప్పటి తరానికి చాలా తేడా ఉందని చెప్పక తప్పదు. పాతతరం కథానాయికలు బొద్దుగా ఉండేవారు. ఈ తరం కథానాయికలు సైజ్ జీరోపై మక్కువ చూపుతారు. ఒకవేళ శరీర కొలతలు పెరిగితే దాన్ని తగ్గించుకోవడానికి నానా అవస్థలు పడుతుంటారు. డైటింగ్ పేరుతో నోళ్లు కట్టేసుకుంటారు. ఈ విషయంలో ఉత్తరాది హీరోయిన్లు ముందుంటారని చెప్పక తప్పదు.

**పెళ్లి తర్వాత**

అలా వివాహం తర్వాత కూడా నాజూకుతనాన్ని మెయింటైన్ చేస్తున్న హీరోయిన్లలో రకుల్ ఒకరు. గతేడాది బాలీవుడ్ నటుడు జాకీ భగ్నానీని ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.. కొందరు హీరోయిన్లు పెళ్లి తర్వాత స్లిమ్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తారు. కారణం.. మళ్లీ నటించడానికి రెడీ అవడమే. హీరోయిన్ రకుల్ కూడా ఆ కోవలోకే వస్తుంది. ఈమె కోలీవుడ్‌లో చివరగా నటించిన ఇండియన్ 2 బాక్సాఫీస్ వద్ద పూర్తిగా నిరాశపర్చింది.

**అది తప్ప**

ఆ తర్వాత దక్షిణాదిలో తనకు అవకాశాలు రాలేదు. అయినప్పటికీ అందాలారబోతతో పలు ఫోటోషూట్లు చేస్తూ వాటిని సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది. దీని గురించి రకుల్ మాట్లాడుతూ.. సాధారణంగా పెళ్లయితే హీరోయిన్ల పని అయిపోయినట్లే అనే భావన ఉందని తెలిపింది. అయితే అది తప్పని, తన విషయంలో అలా జరగడం లేదని పేర్కొంది. తనకు సంబంధించినంతవరకు అందాల ఆరబోత అనేది వారి వారి ఇష్టాన్ని బట్టి ఉంటుందని తెలిపింది. అందం హద్దులను పెళ్లి చెరిపేయదని.. పైగా ప్రోత్సహించే నిచ్చెనలా పని చేస్తుందని చెప్పుకొచ్చింది.

# ది రాజా సాబ్ పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం...

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస భారీ ప్రాజెక్టుల్లో నటిస్తూ తన మార్కెట్‌ను మరింత పెంచుకుంటున్నారు. అదే సమయంలో ప్రేక్షకులు అతని ప్రతి సినిమా కోసం అపారమైన ఆసక్తితో ఎదురు చూస్తారు. ప్రభాస్ క్రేజీ ప్రాజెక్ట్‌లో ఒకటైన 'ది రాజా సాబ్' త్వరలో విడుదల కావాల్సి ఉంది. రొమాంటిక్, హారర్, కామెడీ కలిసిన యూనిక్ జానర్‌లో దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న ఈ చిత్రం మొదటి నుంచే సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చనీయాంశమైంది. ముఖ్యంగా ప్రభాస్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతున్నారని సమాచారం రావడంతో ఈ సినిమా పైన హైప్ ఇంకా పెరిగింది. మొదట ఈ సినిమా డిసెంబర్ 5, 2025న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ తర్వాత విడుదల తేదీని సంక్రాంతి 2026 జనవరి 9కు మార్చారు. అయితే ఈ తేదీ కూడా ఖరారు కాలేదని ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారమవుతోంది. ఈ అనుమానాల నడుమ మేకర్స్ ఫస్ట్ సింగిల్‌ను రిలీజ్ చేసి "సంక్రాంతికే వస్తున్నాం" అని క్లారిటీ ఇచ్చారు. అయినప్పటికీ ఇండస్ట్రీలో మాత్రం సరికొత్త మాటలు వినిపిస్తున్నాయి. ఇండస్ట్రీలో వినిపించే టాక్ ప్రకారం థియేట్రికల్, ఓటీటీ, సాటిలైట్ రైట్స్ వంటి కీలక డీల్స్ ఇంకా ఫైనల్ కాలేదట. ప్రభాస్ సినిమాలపై సాధారణంగా భారీ క్రేజ్ ఉండే నేపథ్యంలో ఇది కొంచెం ఆశ్చర్యకరంగా ఉంది. డిస్ట్రిబ్యూటర్లు రిస్క్ తీసుకోవడానికి మొహమాటపడుతున్నారని, సినిమా బజ్ ఆశించిన స్థాయిలో లేదని, కావలసిన రేంజ్‌లో ఆఫర్లు రాలేదని సమాచారం ప్రభాస్ నటించే 'స్పిరిట్' సినిమాకు ఇప్పటికే ₹160 కోట్ల భారీ ఓటీటీ డీల్ కుదిరినట్లు వార్తలు వచ్చాయి. అయితే 'రాజా సాబ్' విషయంలో ఇంకా ఓటీటీ ఒప్పందం జరగకపోవడం చర్చనీయాంశమైంది. ఈ సినిమాకు విపరీతంగా VFX ఉండటం వల్ల పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఆలస్యమవుతున్నాయట. గ్రాఫిక్స్ వర్క్ పూర్తికాకపోవడం కూడా విడుదల తేదీపై ప్రభావం చూపుతోంది. ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయలేకపోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీనితో సినిమా నిజంగా సంక్రాంతికే వస్తుందా? లేక వాయిదా పడుతుందా? అనే సందేహాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com